ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఏలూరు
జిల్లా వార్తలు
5
బుధవారం 9 ఏప్రిల్ 2025



ఇంటర్వ్యూ..

సహకార సంఘాల్లో
పారదర్శక పాలన



ఆరిమిల్లి శ్రీనివాస్
జిల్లా సహకార అధికారి

(ఏలూరు- ఆంధ్రజ్యోతి)

సహకార సంఘాల్లో పారదర్శక పాలన, రైతులకు సత్వర రుణం, తదితర సేవలకు ముఖ్యమైన చర్యలు తీసుకుంటున్నాం. సొసైటీల ఆన్‌లైన్ ప్రక్రియ ముగిశాక సుదీర్ఘ కాలంగా ఒకే చోట పనిచేస్తున్న వారిని బదిలీ చేస్తాం. సొసైటీ నష్టాలకు కారకులను ఉపేక్షించేది లేదు. వారి నుంచి నిధులను కక్కిస్తామని జిల్లా సహకార అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రజ్యోతికి మంగళవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

? సహకార సంఘాల ద్వారా రైతుల సంక్షేమం..

డీసీవో : జిల్లాలో ఒకే పంట ఉత్పత్తి చేసే రైతులతో ఎఫ్‌పీవో సంఘాలను ఏర్పాటు చేస్తున్నాం. మామిడి, పొగాకు, జీడిమామిడి, మిర్చి, నిమ్మ తదితర పంటలు పండించే వారితో సంఘాలు ఏర్పాటు చేస్తాం. వారికి ఏటా రూ.6లక్షల చొప్పున ఐదేళ్లకు రూ.30 లక్షలు నాబార్డు ఆర్థిక సహకారం అందిస్తుంది. పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌కు చర్యలు తీసుకుంటాం. దీనికి 8 సంఘాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

? పంట ఉత్పత్తుల నిల్వ చేయడానికి..

డీసీవో : గతంలో 33 చోట్ల గోడౌన్ల నిర్మాణాలు జరిగాయి. వాటిని అందుబాటులోకి తేడానికి చర్యలు తీసుకుంటున్నాం. తాజాగా వరల్డ్ లార్జ్ గ్రెయిన్ స్టోరేజీ ప్లాన్ కింద నాబార్డు ఆర్థిక సహకారం అందించడానికి ముందుకు వచ్చింది. సహకార కమిషనర్ కూడా ఉత్తర్వులు ఇచ్చారు. గోడౌన్ల నిర్మాణంతో పాటు వరి, మొక్కజొన్న, ఇతర పంటల తేమ ఆరబోతకు డ్రయర్లు యార్డులు ఏర్పాటుచేస్తాం. రూ. 2కోట్ల వ్యయంతో యూనిట్లు మంజూరుకు సిద్ధం చేస్తున్నాం. కొప్పాకలో ఈ రకమైన గోడౌన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నాం.

? సొసైటీల్లో అక్రమాలు.. వారిపై చర్యలు..

డీసీవో : గత వైసీపీ ప్రభుత్వం హయాంలో 8 చోట్ల రూ.30 కోట్ల మేర ఆర్థిక అవకతవలు జరిగాయి. టి నరసాపురం, చింతలపూడి, రంగాపురం, కామవరపుకోట, బాదంపూడి, సరిపల్లె, వట్లూరు, జంగారెడ్డిగూడెంలో నిధులు దుర్వినియోగం జరిగాయి. 8 మంది సెక్రటరీలను సస్పెండ్ చేశాం. ఒకరు హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుని ఉద్యోగంలో కొనసాగుతున్నారు. అక్రమాలకు పాల్పడిన వారి ఆస్తుల నుంచి రికవరీకి రూ.40 కోట్ల మేర అటాచ్‌కు పెట్టాం. డిక్రీలు రావాల్సి ఉంది. వస్తే వాటిని రికవరీ చేస్తాం. ఏలూరు, నూజివీడు డివిజన్ రిజిస్ట్రార్లు పర్యవేక్షణ జరుపుతున్నారు.

? అక్రమాలకు ఏ విధంగా కళ్లెం వేస్తారు..

డీసీవో : గతంలో ఏడాదికోసారి సొసైటీ రికార్డుల ఆడిట్ జరిగేది. సహకార చట్టం 50కు సవరణల్లో భాగంగా ప్రతీ నెల జరిగిన లావాదేవీల నిరంతరం ఆడిట్ జరుగుతుంది. ఏ నెలకానెల చార్టర్డ్ అక్కౌంట్, డిపార్టుమెంట్ అధికారులు వేర్వేరుగా ఆడిట్ చేస్తారు. ఈ విధానంతో ఆర్థిక అవకతవకలకు చెక్‌పెట్టాం.

? సుదీర్ఘ కాలంగా ఒకేచోట సిబ్బంది..

డీసీవో : జిల్లాలో సొసైటీల కంప్యూటకరీణ పూర్తి కావస్తుంది. తర్వాత సొసైటీల్లో ఐదేళ్ల పైబడి ఒకేచోట విధుల్లో ఉన్న వారిని బదిలీ చేస్తాం. దీనికి గైడ్‌లైన్స్ వచ్చాయి. జిల్లా ఉన్నతాధికారుల నోటీసులో పెట్టి సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న వారి బదిలీ చేస్తాం.

ఒంటిమిట్టకు ప్రత్యేక బస్సు సర్వీసు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ భద్రాద్రి అయిన ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణానికి ఆర్టీసీ ఏలూరు డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేశారు. ఈనెల 10న రాత్రి 8 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు (సర్వీస్ నెంబర్ 24790) ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ ప్రారంభించినట్లు జిల్లా ప్రజా రవాణాశాఖాధికారి ఎన్‌వీఆర్ వర ప్రసాద్ మంగళవారం తెలిపారు. 11న సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకూ సీతారాముల కల్యాణం జరుగుతుందన్నారు. మరుసటి రోజు ఉదయం బస్సు ఏలూరు చేరుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

రైతు ఇబ్బంది పడకూడదు

ధాన్యం కొనుగోలులో సిబ్బందికి జాయింట్ కలెక్టర్ సూచనలు

దెందులూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో రైతులు కంగారు పడుతున్నారని, ధాన్యం విక్రయించుకోడానికి ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదని జేసీ పి.ధాత్రిరెడ్డి అన్నారు. దెందులూరు సహకార సంఘ ఆవరణలో వ్యవసాయశాఖ జేడీ, సివిల్ సప్లయి డీఎంల ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందికి మంగళవారం ధాన్యం కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దెందులూరు తహసీల్దార్ సుమతి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు

గాలి.. వాన



కొయ్యలగూడెంలో భారీ వర్షం

జిల్లాలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారింది. గాలి.. వానతో రైతులు హడలి పోయారు. ఏలూరు నగరంలో గాలి ధాటికి పలు దుకాణాల వద్ద హోర్డింగ్‌లు ఎగిరిపోయాయి. అనేక ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రహదారులు, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం, మొక్కజొన్న, మిర్చితో పాటు పొగాకు తడిచింది. తోటల్లో మామిడి నేలరాలింది. మరోవైపు జోరువానతో వాతావరణం చల్లబడడంతో ఉక్కబోత నుంచి ఉపశమనం కలిగింది.

- గాలికి విరిగిపడిన చెట్లు
- తోటల్లో నేల రాలిన మామిడి
- వర్షంతో తడిచిన ధాన్యం, మిర్చి
- విద్యుత్ సరఫరాలో అంతరాయం

అకాల వర్షంతో రైతుల్లో ఆందోళన - చల్లబడిన వాతావరణం

ఏలూరు సిటీ, పెదపాడు, పెదవేగి, కొయ్యలగూడెం, కామవరపుకోట, జీలుగుమిల్లి, కుక్కునూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిశాయి. మామిడితోటలలో కాయలు రాలిపోవడంతో రైతుల ఆవేదన వర్ణనాతీతం. గాలి తీవ్రతకు చెట్లు, కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. ఏలూరు నగరంతో పాటు జిల్లాలో ని చింతలపూడి, జంగారెడ్డిగూడెం, లింగపాలెం, నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి. ముసునూరు, టి.నరసాపురం, వేలేరుపాడు, పోలవరం, బుట్టాయగూడెం, దెందులూరు, భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, కైకలూరు తదితర ప్రాంతాల్లో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఏలూరు మండలం మాదేపల్లిలో చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడింది. చింతలపూడి పరిసర ప్రాంతాల్లో రెండు రోజుల నుంచి విద్యుత్ సరఫరా మెరుగుపడలేదు. ఈదురు గాలులతో మళ్లీ అంతరాయం కలిగింది.

పరుగులు పెట్టిన రైతులు

పెదపాడు మండలంలో జాతీయ రహదారిపై ఆరబెట్టిన ధాన్యం కాపాడుకోడానికి రైతులు పరుగులు తీశారు. కొయ్యలగూడెం మండలంలో తోటల్లో మామిడి కాయలు నేల రాలాయి. పొగాకు, మిర్చి రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. భారీ వర్షంతో చెట్లు విరిగి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పెదవేగి మండలంలో కొన్ని చోట్ల దుకాణాలపై హోర్డింగ్స్ ఎగిరిపడ్డాయి. కల్లాల్లో మొక్కజొన్న కండెలు తడిసిపోయాయి. వర్షం ఉద్యాన పంటలకు మేలు చేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కామవరపుకోట మండలంలో గాలి, వర్షంతో చెట్ల కొమ్మలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రోడ్లపై ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దయింది. అరటి, మామిడి పంటలకు నష్టం కలిగిందని రైతులు వాపోతున్నారు. జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు కల్లాల్లో మిర్చి పంటపై రైతులు టార్పాలిన్‌లు కప్పారు. దిబ్బగూడెంలో పొగాకు పంటపై టార్పాలిన్‌లు గాలికి ఎగిరిపోయాయి. పలు చోట్ల మామిడి నేల రాలింది. చిర్రివారిగూడెంలో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. కుక్కునూరు మండలంలో పలు చోట్ల వర్షం కురిసింది. చీరవల్లిలో వడగండ్ల వర్షం పడింది. కూలీల కొరతతో మిర్చి కోతలు పూర్తి కాలేదు. క్వింటాళ్ల కొద్దీ మిర్చి కల్లాల్లో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎండ వేడిమితో అల్లాడిపోయిన ప్రజలకు గాలి, వాన ఉపశమనం ఇచ్చింది. మధ్యాహ్నం ఎండ వేడిమి అధికంగా ఉండగా సాయంత్రం ఆరుగంటల సమయానికి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కారుమబ్బులు కమ్ముకుని, గాలులు, వర్షంతో వేసవి తాపం నుంచి ఉపశమనం పొందారు. పలుచోట్ల జోరు వానతో రోడ్లపై నీరు నిలిచింది.

మాదేపల్లిలో పడిపోయిన విద్యుత్ స్తంభం





బుట్టాయగూడెంలో పడిపోయిన తాటాకిల్లు



పెదపాడు మండలంలో జాతీయ రహదారిపై ఆరబెట్టిన ధాన్యం



పెదవేగిలో మొక్కజొన్న కండెలు



కుక్కునూరులో కల్లాలపై మిర్చి

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

జిల్లాలోని తూనికలు, కొలతల శాఖ పరిధిలో నిత్యావసర సరుకుల కొనుగోలు, తూకంలో తేడాలు, వస్తువులపై ఎక్స్‌పైరీ డేట్ తేడా ఉన్నా పెట్రోల్ బంకుల్లో తక్కువ కొడుతున్న బంగారం తూకాలలో తేడాలున్న నాణ్యతలో తేడాలపై 9వ తేదీ బుధవారం ఉదయం 11-12 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' నిర్వహించనుంది. వినియోగదారులు **92478 55290** నెంబరుకు ఫోన్ చేసి సమస్యలను వివరిస్తే.. వాటి పరిష్కారానికి తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ బి.సాయిరామ్ చర్యలు తీసుకుంటారు.

దొంగలొస్తారు
తస్మాత్ జాగ్రత్త!
వేసవిలో రెచ్చిపోతున్న దొంగలు
ఏలూరు జిల్లా కంట్రోల్ రూమ్
నెం. 83329 59175

ఇద్దరు దొంగల అరెస్టు
రూ.ఐదు లక్షల నగదు స్వాధీనం

పెంచిన గ్యాస్ భారం
ప్రభుత్వమే భరించాలి
శాసనమండలి ప్రతిపక్ష నేత
బొత్స సత్యనారాయణ
7



ఆగిరిపల్లిలో సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షిస్తున్న మంత్రి పార్థసారథి, కలెక్టర్ వెట్రి సెల్వి, జేసీ ధాత్రి రెడ్డి తదితరులు

సీఎం చేతుల మీదుగా
పనిముట్లు, రుణాల పంపిణీ

- 11న ఆగిరిపల్లిలో జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం
- ఏర్పాట్లపై కలెక్టర్, అధికారులతో మంత్రి పార్థసారథి సమీక్ష

ఆగిరిపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా బలహీనవర్గాలకు, వృత్తిదారులకు పనిముట్లు, రుణాలు పంపిణీ చేయనున్నట్లు గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఈ నెల 11న ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో సీఎం పర్యటన సందర్భంగా కలెక్టర్ కె.వెట్రి సెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి, వివిధ శాఖల అధికారులతో కలసి మంత్రి పరిశీలించి, ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని రాష్ట్రస్థాయి ఉత్సవంగా ఆగిరిపల్లిలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరై బలహీన వర్గాల జీవనోపాధికి అవసరమైన పనిముట్లు, రుణాలను పంపిణీ చేస్తారు. వారి వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుంటారని మంత్రి చెప్పారు. ఆగిరిపల్లి శివారు వడ్లమానులో హెలిప్యాడ్, బహిరంగ సభకు అధికారులు ప్రతిపాదించిన ప్రదేశాలను పరిశీలించారు. వేసవి దృష్ట్యా బహిరంగ సభలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తాగునీరు, టెంట్లు, కుర్చీలు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో ఆనంద్‌బాబు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎ.సతీష్, చిట్నేని శివ రామకృష్ణ మడుపల్లి గోపాలకృష్ణ, నక్కనబోయిన వేణు, నాయకులు, ప్రజాప్రతిధులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో
పౌష్టికాహార పక్షోత్సవాలు

గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



ఏలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యంపై అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. పోషణ్ పకడో పేరిట మంగళవారం ప్రారంభమైన పౌష్టికాహార పక్షోత్సవాలు ఈనెల 22 వరకు నిర్వహించనున్నారు. 2,225 అంగన్‌వాడీ కేంద్రాల్లో లక్షకుపైగా చిన్నారులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపడతారు. గర్భస్థ దశ నుంచి రెండేళ్ల వరకు అంటే వెయ్యిరోజుల సంరక్షణపై శ్రద్ధ, పోషన్ ట్రాకర్‌లో పేర్ల నమోదు తదితర కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. పిల్లల ఎదుగులను అంచనా వేయడం, ఆరోగ్య పరిరక్షణకు పరీక్షలు, బిడ్డకు పోషకాహారం అందించడం, మందులతో చికిత్సలు, అంగన్‌వాడీ కార్యకర్తలు స్వయంగా పిల్లలు, తల్లులు తీసుకోవాల్సిన జాగ్రతలపై పర్యవేక్షణ చేయనున్నారు. రోజుకో కార్యక్రమంతో వారోత్సవాలను 15 రోజులు నిర్వహిస్తారు. దుగ్గిరాల అంగన్‌వాడీ కేంద్రంలో జిల్లా మహిళా, శిశు అభివృద్ధి ప్రాజెక్టు డైరెక్టర్ పి శారద పరిశీలించి చిన్నారుల బరువు తనిఖీ చేశారు. బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.



టి.నరసాపురం మండలం బొర్రంపాలెం కాలనీలో నిర్మితమైన ఇళ్లు

ఇళ్లు.. ఇంటి స్థలాలు
అమ్మేస్తున్నారు!

జగనన్న కాలనీలో అనర్హులకే అందలం

పేదలకు ఇంటి స్థలాల పేరిట అప్పటి వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో అనర్హులకు పెద్ద పీట వేసింది. అర్హులకు ఇళ్లు, స్థలాలు అందలేదు. అప్పటికే ఇళ్లు, స్థలాలు ఉన్నవారికి కూడా కాలనీల్లో మళ్లీ కేటాయించారు. కొందరు పేదలు ఆర్థిక స్తోమత లేక ఇంటి నిర్మాణం చేపట్టలేదు. అప్పటికే ఇళ్లు ఉన్నవారు కాలనీల్లో నిర్మాణం ఊసే ఎత్తలేదు. అవసరం ఉన్న వారు అప్పులు చేసి ఇళ్లు నిర్మించారు. ఆయా కాలనీల్లో స్థలాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అనర్హులకు కేటాయించిన స్థలాలు అమ్మకానికి పెట్టారు.

- కాలనీల్లో ఇళ్లు.. స్థలాల బేరసారాలు
- రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు..
- ఇప్పటికే చేతులు మారిన స్థలాలు
- అర్హులకు న్యాయం చేయాలని వినతి


టి.నరసాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పేదకు లబ్ధిచేకూరుస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో అనర్హులకే అవకాశం కల్పించారు. అప్పటి పాల కులు, అధికార యంత్రాంగం ఏకమై అనేక మంది అనర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇళ్లు ఉన్నవారికే ఇళ్లు, స్థలాలు కేటాయించడంతో కొందరు నిర్మాణం ఊసే ఎత్తలేదు. మరికొందరు స్థలాలు, ఇళ్లను రూ.లక్ష నుంచి రూ.10లక్షల వరకు రేటు కట్టి మరీ విక్రయించినట్లు ఆరోపణలు వచ్చాయి. టి.నరసాపురం మండలం 15 గ్రామ పంచాయతీల్లో 34 లేఅవుట్లలో సుమారు 1100మంది లబ్ధిదారులను గుర్తించారు. అనర్హులకే లబ్ధి చేకూరిందని విమర్శలు వచ్చాయి.

నిర్మాణాలు అంతంత మాత్రం

పేదలు ఇళ్ల నిర్మించుకునే ప్రయత్నం చేసినా ప్రభుత్వ సాయం చాలక మధ్యలోనే నిర్మాణం నిలిపివేశారు. అనర్హులు నిర్మాణం జోలికి పోలేదు. అక్కడక్కడా నిర్మాణాలు చేపట్టిన అనర్హులు తర్వాత అమ్మకాలకు తెర తీశారు. మధ్యలో ఇళ్ల నిర్మాణం నిలిచిపోయిన వారికి ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం ప్రభుత్వం సాయం పెంచినా ఇళ్ల నిర్మాణంలో పురోగతి లేకపోగా విక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన పూర్తయిన గృహాలకు వైసీపీ ప్రభుత్వం సాయం ఆపేయడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీ పేరుతో అనర్హులకు ఇళ్లు మంజూరు చేశారని వాటిలో చాలా ఇళ్లు ఇప్పటికే చేతులు మారాయని క్రయ, విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయని పలువురు చెబుతున్నారు. స్థలాలు, ఇళ్ల విక్రయాలపై సమగ్ర విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలంటూ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి వినతిపత్రం అందజేశారు.

రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ అధికారులు స్పందించి నిర్మాణాలు చేపట్టని వారు, స్థలాలు విక్రయించిన వారి ఇళ్లను స్వాధీనం చేసుకుని అర్హులకు పంచాలని కోరుతున్నారు.

విక్రయించిన ఇళ్లను స్వాధీనం చేసుకోవాలి



జగనన్న కాలనీల్లో కొన్ని ఇళ్లు విక్రయాలు జరుగుతున్నాయి. అనర్హులకు ఇళ్లు కేటాయించారు. అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి అనర్హులకు ఇచ్చిన ఇళ్లు రద్దుచేసి విక్రయాలు జరిపిన గృహాలు స్వాధీనం చేసుకోవాలి.

- కొండపల్లి రవి

అర్హులకు కేటాయించాలి



ఇళ్లు లేని పేదలు నానా అవస్థలు పడుతున్నారు. అనర్హులకు ఇళ్లు ఇచ్చి పేదలను అన్యాయం చేస్తున్నారు. నిర్మాణాలు చేపట్టని స్థలాలు స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలి. అర్హులకు న్యాయం చేయాలి.

- మడకం కుమారి, సీపీఎం నాయకురాలు



భైరాగిమఠంలో ఘనంగా తెప్పోత్సవం

పెంటపాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా కే.పెంటపాడు భైరాగి మఠం గోపాలస్వామి అంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఘనంగా తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు త్రిలోచనదాస్, పూర్ణచంద్ర త్రిపాఠిల ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ సమీపంలో ఉన్న కోనేరులో ప్రత్యేకంగా అలంకరించిన హంసవాహనంపై స్వామి వారు విహరించారు. భారీ బాణసంచా కాల్చారు. తెప్పోత్సవం వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు హాజరయ్యారు. అనంతరం తెల్లవారు జామువరకూ స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం స్వామికి చక్రస్నానం, శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయని ఈవో బీవీ చంద్రశేఖర్ తెలిపారు.

వైభవంగా క్షీరా రామలింగేశ్వర స్వామి కల్యాణం



పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రమైన క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వేకువ జామున 5 గంటలకు స్వామివారికి, పార్వతీ దేవితోనూ క్షేత్ర పాలకుడు శ్రీజనార్థన స్వామికి శ్రీలక్ష్మీదేవితోనూ వేద మంత్రాల మధ్య వైభవంగా కల్యాణం నిర్వహించారు. అభిషేక పండితులు భమిడిపాటి వెంకన్న, మద్దూరి సూరిబాబు, అర్చకులు కృష్ణప్ప, పూర్ణయ్య, అనీల్‌కుమార్ శర్మ కల్యాణ పూజలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు స్వామి వార్ల రథోత్సవం ప్రారంభించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, మేళతాళాలు, కేరళ నృత్యాలు, బ్యాండ్ మేళాలతో రథోత్సవం కన్నుల పండుగలా సాగింది. ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు దంపతులు కల్యాణం జరిపించారు. పట్టణ సీఐ రజనీకుమార్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పచ్చని చెట్లకు కోత



బుట్టాయగూడెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మర్లగూడెం-మార్కండేయపురం గ్రామాల మధ్య పంచాయతీరాజ్ శాఖకు చెందిన ప్రధాన రహదారి వెంబడి ఉన్న పచ్చని చెట్లను నరికివేయడం పట్ల మండల ప్రజలు, పర్యావరణ ప్రేమికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీడనిచ్చే చెట్లను నరికివేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇటీవలే మార్కండేయపురంలో నూతనంగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచి మర్లగూడెంకు టౌన్ ఫీడర్ (24 గంటల విద్యుత్ సరఫరా)విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేయడానికి నూతనంగా విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేస్తున్నారు. స్థంభాల ఏర్పాటుకు చెట్లు అడ్డు వస్తున్నాయన్న కారణంతో చెట్లను నరికి వేస్తున్నారు. అవసరమైతే రోడ్డుకు కాస్తంత దూరంగా స్థంభాలను ఏర్పాటు చేయవచ్చు కదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్ళి చర్యలు తీసుకుంటామని ఏఈ చెప్పారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుంటారని ఏఈ చెప్పడంపై పర్యావరణ వేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భక్తజన వాడపల్లి

అంగరంగ వైభవంగా దేవదేవుడి కల్యాణం

కోనసీమ తిరుమల కళకళలాడింది.. దేవదేవుడు తిరువీధుల్లో తిరుగాడాడు.. భక్తజనానికి కనుల విందు చేశాడు.. స్వామిని వేడుకునేందుకు వేలాదిగా భక్తజనం పోటెత్తారు.. స్వామిని కనులారా చూసేందుకు పోటీపడ్డారు.. గోవిందా..గోవింద అంటూ గొంతెత్తి స్వామిని పిలిచారు.. కొలిచారు.. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామిని భక్తజనం దర్శించుకుని తరించారు.. వాడపల్లి వెంకన్న తీర్థ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మంగళవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి స్వామి రథోత్సవం, దివ్యకల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ క్రతువును భక్తజనం కనులారా వీక్షించి పులకించిపోయారు.


రథోత్సవం..


కల్యాణ మహోత్సవంలో తలంబ్రాల దృశ్యం

- బ్రహ్మాండంగా కోనేటి రాయుని రథోత్సవం
- తిరువీధుల్లో మెరిసిన దేవదేవుడు
- ప్రారంభించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు
- పులకించిన భక్తజనం

ఆత్రేయపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణమహోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవారం స్వామివారి తీర్థం, రథోత్సవం, కల్యాణోత్సవాలకు వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని కల్యాణోత్సవాలను తిలకించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో ప్రధాన హోమాలు, నిత్యబలిహరణతో కార్యక్రమాలను ప్రారంభించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీవో శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీమోహన్‌తోపాటు అధికార యంత్రాంగం, కూటమి శ్రేణులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవమూర్తులను ఆలయం ఎదురుగా ఉన్న ఎదుర్కోలు మండపం వద్దకు తొడ్కుని వెళ్లి వేదపడింతులు, అర్చకులు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారు తిరువీధులలో విహరించారు.

రథోత్సవానికి తరలివచ్చిన భక్తజనం...

స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మధ్యాహ్నం మూడు గంటలకు రథంపై స్నపనమూర్తులు వేదమంత్రాల సాక్షిగా అలంకృతలయ్యారు. ఎమ్మెల్యే బండారు రథోత్సవాన్ని ప్రారంభించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తజన గోవిందనామస్మరణతో స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. తిరువీధుల్లో డ్రోన్లతో రథోత్సవంపై పూలవర్షం కురిపించారు. స్వామివారి కల్యాణోత్సవాలలో భాగంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆర్డీవో శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీమోహన్, ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావుతోపాటు అధికార యంత్రాంగం కల్యాణోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎక్కడ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. 200 మంది పోలీస్ సిబ్బంది ఏర్పాట్లలో వివిధ ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహించారు. భక్తులకు మజ్జిగ, తాగునీరు, బిస్కెట్లు, అన్నదానం ఏర్పాటుచేశారు.


కల్యాణ వేదిక వద్దకు స్వామివార్లు


రథోత్సవంలో భక్తజనం

కల్యాణం.. కమనీయం

వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి స్వామివారి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం నుంచి స్వామి అమ్మవార్లను మంగళవాయిద్యాలతో శ్రీనివాస ప్రాంగణంలోని కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. సుగంధ పరిమళాలు వెదజల్లే వివిధ రకాల ఫలపుష్పాలతో అలకరించిన కల్యాణ వద్ద స్వామి అమ్మవార్లు ఆశీనులయ్యారు. వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం ఖండవిల్లి వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు స్వామివారి దివ్యకల్యాణ క్రతువును నిర్వహించా రు. సుముహూర్త వేళ కన్యాదానం, మాంగళ్యధారణ, తలంబ్రాల తంతును వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తజన గోవిందనామస్మరణ నడుమ వైభవం గా నిర్వహించారు. స్వామివారికి పట్టువస్త్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఎమ్మెల్యే బండారు సత్యానందరావు-కమలారాణి దంపతులు, జేసీ నిషాంతి, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు-కనకదుర్గాదేవి దంపతులు, ఆర్డీవో శ్రీకర్ దంపతులు, డీఎస్పీ సుంకర మురళీమోహన్ దంపతులు, దేవదాయ డిప్యూటీ కమిషనరు డీఎల్వీ రమేష్‌బాబు, జిల్లా దేవదాయ శాఖ అధి కారి సత్యనారాయణ స్వామివారికి సమర్పించారు. స్వామివారి కల్యాణ తంతు జరుగుతుండగా వందల కిలోల హరతికర్పూరంతో జ్యోతిని వెలిగించారు. మిరిమిట్లు గొలిపే బాణసంచా కాల్పులు, విద్యుత్ వెలుగుల నడుమ నిర్వహించిన స్వామివారి కల్యాణాన్ని వేలాదిమంది భక్తులు తిలకించి మంత్రముగ్ధులయ్యారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జ్ బండారు శ్రీనివాస్, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనం తకు మారి, ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డి, జడ్పీటీసీ బోణం సాయి బాబా, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహరావు, కాయల జగన్నాథం, కూటమి నేతలు, భక్తులు పాల్గొన్నారు.


వేడుకలో అతిథులు

ఆర్థికం అయోమయం



- పడకేసిన వ్యాపారాలు
- పట్టణాలలో షాపులు ఖాళీ
- వెలవెలబోతున్న మార్కెట్ కూడళ్లు
- ఆన్‌లైన్ మార్కెట్ ప్రభావం
- ప్రజల్లో తగ్గిన కొనుగోలు శక్తి



పాలకొల్లులోని ఒక వస్త్ర వ్యాపారి మొన్నటి వరకూ భారీగా అద్దె చెల్లించి షోరూం నిర్వహించారు. అయితే అమ్మకాలు తగ్గడంతో సిబ్బందికి జీతాలు ఇవ్వలేక ఒకవైపు అద్దె చెల్లించలేని పరిస్థితి మరో వైపు..దీంతో షోరూం కాస్తా షాపుగా మారింది. లక్షల్లో అద్దె చెల్లించే షోరూంను ఖాళీ చేసి చిన్న షాపులోకి వ్యాపారాన్ని మార్చుకున్నారు.

పాలకొల్లు పట్టణంలోని భీమవరం రోడ్డులో ఒక ఫాస్ట్‌ఫుడ్ సెంటరును ఇటీవల ప్రారంభించారు. ప్రారంభించిన మూడు నెలలకే మూసేశారు. కారణం పరిశీలిస్తే అమ్మకాలు అంతంత మాత్రంగా ఉండటం, సరైన ఆదాయం లేక అద్దె సైతం ఇవ్వలేని పరిస్థితుల్లో షాపు యజమానికి ఇచ్చిన అడ్వాన్స్ మొత్తం తీరకుండానే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను మూసివేశారు.

ఇటీవల టూవీలర్స్ ఫైనాన్స్ కంపెనీలు తగినంత వ్యాపారం లేక మూత పడుతున్నాయి. పాలకొల్లులో అదేకోవకు చెందిన ఒక టూవీలర్ ఫైనాన్స్ కంపెనీ ఆశించిన స్థాయిలో వ్యాపారం లేక మరో వ్యాపారం వైపు మరలుతున్నట్లు తెలిసింది..

పాలకొల్లు, /పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక మాంద్యం వ్యాపార వర్గాల్లో గుబులు పుట్టిస్తోంది. ఒకవైపు ఆన్ లైన్ మార్కెట్ పోటీ, మరోవైపు ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గడంతో పలు వ్యాపారాలు సాగక అద్దెలు కట్టుకోలేని పరిస్థితికి వచ్చేశాయి. ప్రభుత్వం మారితే వర్తక వాణిజ్యాలకు కొంత ఊపు వస్తుందని భావించినప్పటికీ నూతన ప్రభుత్వంలోనూ వర్తకులకు కష్టాలు తప్పడం లేదు. వాస్తవానికి ప్రజల్లో కొనుగోలు శక్తి ప్రతీ ఏటా 10 నుంచి 15 శాతం పెరుగుతూంటుంది. అయితే ఇప్పుడు అందుకు భిన్నంగా అన్ని అమ్మకాలు మూడింట ఒకవంతు తగ్గాయని వర్తకులు చెబుతున్నారు. ఆన్‌లైన్ మార్కెట్, ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గడం కారణాలుగా చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితి రెండు మూడు దశాబ్దాలలో లేదని ఐదేళ్ల జగన్ పాలనలో కష్టాలు మొదలయ్యాయని, కూటమి ప్రభుత్వంలోనూ అదే పరిస్థితి కొనసాగు తోందని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. ఈ దుస్థితికి పలు కారణాలు ఉన్నాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు

సంక్షేమ పథకాల ప్రభావం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సంక్షేమ పథకాలను విస్తృతం చేశారు. ముఖ్యంగా వృద్ధులకు నెలవారీగా రూ.4000 పెన్షనే కాకుండా వివిధ పథకాల ద్వారా పేదలకు వేల కోట్లు పంచిపెడుతున్నారు. సాధారణంగా మార్కెట్‌లో కొనుగోళ్లు పెరగాలంటే మధ్య తరగతి ప్రజల చేతుల్లో పుష్కలంగా సొమ్ములు ఉండాలి. ఐతే అందుకు భిన్నంగా సంక్షేమ ఫలాలు కొన్ని వర్గాల వారికే అందుతూండటంతో అందులో కొంత మొత్తం సొమ్మే మార్కెట్‌కు వస్తోంది. ఈ కారణంగా వ్యాపారాలు మందగించాయని విశ్లేషకులు చెబుతున్నారు.

సొమ్ములు ఇతర రాష్ట్రాలకు

రాష్ట్రంలో అసంఘటిత రంగంలో కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఇక్కడ వ్యవసాయ పనులు మొదలుకొని, భవన నిర్మాణ పనులు, ఇతర పనులకు బిహార్, యూపీ, రాజస్థాన్, బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి వేలాది మంది కార్మికులు రాష్ట్రానికి వచ్చి ఇక్కడ పనులు చేసుకుంటూ అవసరం మేరకే ఖర్చులు చేసుకుని మిగిలిన సొమ్మును తమ తమ రాష్ట్రాలకు తరలిస్తున్నారు.దీంతో ఇక్కడ వ్యాపారాలు పడకేశాయి. స్థానికంగా ఉన్న అసంఘటిత రంగ కార్మికులు సైతం వారానికి 4 రోజులు మించి పనిచేయడం లేదు. వృద్ధి రేటు తగ్గి మార్కెట్‌లోకి విరివిగా సొమ్ములు రావడం లేదు.సామాన్య పేద వర్గాలలో ప్రతీ ఇంటిలోనూ ఏదో ఒక రూపంలో సంక్షేమ పథకం ద్వారా సొమ్ములు అందుతున్నాయి.ఈజీ మనీకి అల వాటుపడిన పౌరులు ఆ సొమ్ములతోనే బతికేస్తూ పని దొంగలుగా మారుతున్నారు. ఈ పరిస్థితులు సైతం మార్కెట్ కొనుగోళ్లపై ప్రభావం చూపుతోందని ఆర్థిక రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.


పాలకొల్లు పెద్దగోపురం వద్ద అద్దెకు ఇవ్వబడును అని బోర్డు పెట్టిన షాపు

మద్యం ఎఫెక్ట్

మద్యం అమ్మకాలు ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడం ద్వారా నగదు చలామణి పెరుగుతుందని భావించినప్పటికీ మద్యం వర్తకులకు మార్జిన్ తక్కువగా ఉండటం వల్ల అమ్మకాలలో అధికశాతం కిస్తీలకు, మెయింటినెన్స్‌కు ఖర్చు అవుతోంది. లాభాలు అంతంత మాత్రంగా ఉండి పెద్ద మొత్తాలను ఇతర రంగాలకు పెట్టుబడి పెట్టలేని పరిస్థితుల్లో మార్కెట్ మాంద్యానికి పరోక్షంగా లిక్కర్ వ్యాపారం దోహదపడిందని చెబుతున్నారు.

కలిసి రాని రొయ్యల సాగు

20వ శతాబ్దం నుంచి ఒక దశాబ్దం పాటు ఒక ఊపు ఊపిన రొయ్యలసాగు ఇప్పుడు ఆశించిన స్థాయిలో లేదు. 20 ఏళ్ల క్రితం రొయ్యల మేత బస్తా ధర రూ.500 ఉంటే 40 కౌంట్ ధర కిలో రూ. .500 ఉండేది. ఇప్పుడు మేత ధర రూ.2500లకు చేరుకోగా 40 కౌంట్ ధర కిలో రూ.400కు పడిపోయింది. వేల కోట్లు పెట్టుబడి పెట్టే రొయ్య రైతులు, వ్యాపారులు ఇప్పుడు కనీస పెట్టుబడులు పెట్టలేని స్థితిలో ఉన్నారు

గ్రామీణుల్లో తగ్గిన కొనుగోలు శక్తి

ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న రైతులకు ఏడాదికి సరపడా తినడానికి ధాన్యం నిల్వ చేసుకోలేని పరిస్థితుల్లో మార్కెట్‌కి సొమ్ములు వెచ్చించలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి పట్టణాల్లో వ్యాపారకూడళ్లు కళకళలాడాంటే గ్రామీణ ప్రాంతాలే ఆయువు పట్టు.. 60 శాతం అమ్మకాలు గ్రామీణుల వల్లనే జరుగుతాయి. ఇప్పుడు ఆర్థిక మాంద్యంలో గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి తగ్గింది. దీంతో అమ్మకాలు తగ్గాయి. ఈ పరిస్థితుల్లో పట్టణాల్లో మూడింట ఒక వంతు షాపులు అద్దెకు ఇవ్వబడును.. అమ్మబడును అని బోర్డులు కనిపిస్తున్నాయి

రియల్ ఎస్టేట్ ప్రభావం

రియల్ ఎస్టేట్ రంగం నష్టాలలోనే ఉంది.. ఆస్తుల అమ్మకాలు, కొనుగోళ్లు వేగంగా జరిగితే నగదు చలామణి పెరుగుతుంది. ఇప్పుడు ఐదింట రెండు వంతులు క్రయ విక్రయాలు తగ్గాయి. ఇప్పుడు మార్కెట్‌లో నిత్యావసరాలైన కూరగాయలు, కిరాణా మాత్రమే ఆయా షాపుల సామర్థ్యాన్ని బట్టి అమ్మకాలు జరుగుతున్నాయి. షోడా కొట్టు నుంచి వస్త్ర దుకాణాలు, షాపింగ్ మాల్స్ ఏసీ, ఫ్రిజ్ వంటి షోరూములు వెలవెలబోతున్నాయి.

గుడ్డుకు గడ్డుకాలం

- గుడ్డు ధర పతనం..
- పౌల్ట్రీ విల విల
- వరుస కష్టాలతో రైతులు సతమతం
- బర్డ్‌ఫ్లూ ప్రభావం నుంచి తేరుకోని పరిశ్రమ



తణుకు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ పరిశ్రమ రైతులు వరుస కష్టాలు ఎదుర్కొంటున్నారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి భయాలతో నెల రోజులుగా పరిశ్రమ అతలాకుతలం అయ్యింది. చాలా పౌల్ట్రీల్లో కోళ్లు మృత్యువాత పడ్డాయి. బర్డ్‌ఫ్లూ ఎఫెక్టు ఇతర పౌల్ట్రీలపై కూడా పడింది. ఫలితంగా పరిశ్రమ తీవ్ర సంక్షోభం లోకి వెళ్ళిపోయింది. ఆ విపత్తు నుంచి కాస్త కోలుకున్నప్పటికి ప్రస్తుతం గుడ్డుకు ఆశించిన స్థాయి ధర పలకడం లేదు. అసలే వేసవి కాలంలో కోళ్ల మేత సరిగా తినకపోవడం వల్ల ఉత్పత్తి కూడా తగ్గుతుంది. ఈశాన్య రాష్ట్రాల్లో వినియోగం కూడా తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం గుడ్డు రూ.4 లకు రైతుల వద్ద ట్రేడర్లు కొనుగోలు చేస్తున్నారు. రైతులకు కనీసం 4.75 పైసలు ఉంటే కానీ ఏమాత్రం గిట్టుబాటు కాదు. ప్రతి ఏటా పౌల్ట్రీ రైతులు ఏదో విధంగా ఇబ్బందులు పడుతున్నారు.

తగ్గిన ఉత్పత్తి

వేసవి కాలం కావడంతో గుడ్ల ఉత్పత్తి బాగా తగ్గిపోయింది. ఇదే సమయంలో గత సంవత్సరం 40 లారీల గుడ్లు ఉత్పత్తి అయ్యేవి. ఇపుడు కేవలం 25 లారీల గుడ్లు మాత్రమే ఉత్పత్తవుతున్నాయి.ఉమ్మడి జిల్లాలో కోటి 20 లక్షల కోళ్ల సామర్థ్యం ఉంది. ఆయా కోళ్ల నుంచి 90 లక్షల గుడ్లు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. స్థానికంగా 30 శాతం వరకు వినియోగం అవుతున్నాయి. మిగిలిన 70 శాతం అంటే సుమారుగా 70 లక్షల గుడ్లు పశ్చిమ బెంగాల్, బిహార్, అసోం రాష్ట్రాలకు రోజూ 30 లారీలు గుడ్లు వెళుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ధరలు బట్టి చాలామంది రైతులు నిర్వహణ భారంతో ఆర్థికంగా కష్టాలు ఎదుర్కొంటున్నారు. కూలీలు, విద్యుత్ బిల్లులు, మందులు, మేత ఖర్చులు ఉత్పత్తితో సంబంధం లేకుండా రోజూ తప్పనిసరి. వేసవి కాలం కాబట్టి కూలీల సమస్య కూడా తలెత్తుతుంది. ఉన్నవారిని జాగ్రత్తగా చూసుకోవాల్సి ఉంటుంది.బర్డ్‌ఫ్లూ తర్వాత పరిశ్రమ ఇబ్బందులు నుంచి బయట పడాలంటే కనీసం గుడ్డు ధర అయినా నిలకడగా ఉండాలని పలువురు రైతులు కోరుతున్నారు.

• ధర నిలకడగా ఉండాలి



గుడ్డు ధరలు నిలకడగా ఉండాలి. ప్రస్తుతం రైతులు అనేక ఎత్తుపల్లాలు ఎదుర్కొన్నారు. ఇటీవల పరిశ్రమలో వచ్చిన విపత్తు వల్ల ఇప్పటికీ కోలుకోలేని పరిస్థితిలో రైతులు ఉన్నారు. ప్రస్తుతం గుడ్డుకు ధర గిట్టుబాటు లేకుండా ఉంది. దీంతో మరింత ఆర్థిక ఇబ్బం దులు తప్పడం లేదు. ఇప్పటికే చాలా మంది రైతులు నష్టాలు భరించలేక చాలా మంది ఇతర రంగాల వైపు మళ్లుతున్నారు.

- మల్లిన శ్రీనివాసరావు, నెక్ గోదావరి జోనల్ చైర్మన్

భవన నిర్మాణం.. భారం


తాడేపల్లిగూడెంలో నిర్మాణంలో ఉన్న ఇల్లు

మండుతున్న సిమెంట్, ఐరన్ ధరలు
వారంలో భారీగా పెంపు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సిమెంట్, ఐరన్ ధరలకు రెక్కలొచ్చాయి. ఒకపక్క ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తుండటం, వాతావరణం భవన నిర్మాణాలకు అనుకూలంగా ఉండటంతో నిర్మాణాలు ఊపందుకునే సమయంలో కంపెనీలు ధరల దరువు మోగించాయి. దీంతో భవన నిర్మాణదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేమని భయపడిపోతున్నారు. ఐరన్ ధర టన్నుకు రూ.8 వేలకు పైగా పెంచగా, సిమెంట్ ధరలు రూ.30 నుంచి 50కి పెరిగాయి. నిన్నటి వరకూ టన్ను రూ.57 వేలు పలికిన ఐరన్ ఒక్కసారిగా రూ.65 వేలకు చేరింది. వాటితో పాటు కనిష్టంగా రూ.250 ఉన్న సిమెంట్ రూ.300 వరకూ పెంచేశారు. దీంతో భవన నిర్మాణ రంగంపై భారీగా భారం పడింది. ఏడాదిన్నరగా భవన నిర్మాణాలు సరిగా లేక ధరలు కనిష్టంగా ఉండగా భవణ నిర్మాణాలు ఊపందు కునే తరుణంలో ఈ ధరల పెరుగుదల సామాన్యుల నడ్డి విరిచినట్టేనని నిర్మాణదారులు వాపోతున్నారు. సిమెంటు, ఐరన్ ధరలు పెంచినట్టే ఎర్ర ఇటుకలు, సిమెంటు ఇటుకలు, ఇలా భవన నిర్మాణానికి అవసరమైన సామగ్రి కూడా ఒక్కసారిగా పెంచేశారు. ఎర్ర ఇటుకలు రూ.5 నుంచి 6 వరకూ విక్రయిస్తున్నారు. సిమెంటు ఇటుకలు రూ.21 నుంచి 23 వరకూ పెంచేశారు.

ఇల్లు కట్టాలంటే భయమేస్తోంది



సిమెంట్, ఐరన్ ధరలు భారీగా పెరగడంతో ఇల్లు కట్టుకుంటున్నవారిపై భారీగా భారం పడింది. ఇల్లు కట్టుకోవాలంటే భయపడుతున్నాం. భవన నిర్మాణ సామాగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

దేవన మల్లికార్జునరావు, నవాబుపాలెం

మొన్నటి వరకూ ఇసుక సమస్య



మొన్నటి వరకూ ఇసుక ధరల వల్ల ఇల్లు కట్టుకోలేకపోయాం.ఇప్పుడు ఇసుక అందుబాటులో ఉంది.వాతావరణం అనువుగా ఉండటంతో ఇల్లు కట్టుకుందామంటే సామాగ్రి ధరలు పెరిగిపోయాయి.ఏం చేయాలో తెలియడం లేదు.

పి.సుబ్బారావు, ఉప్పరగూడెం


చినకాపవరంలో పీఎంశ్రీ ల్యాబ్‌ను ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ రఘురామ, తదితరులు

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్లు

కెమిస్ట్రీ ల్యాబ్‌లతోపాటు కంప్యూటర్ ల్యాబ్‌లు : డిప్యూటీ స్పీకర్ రఘురామ

ఆకివీడురూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. చినకాపవరం జడ్పీ పాఠశాలలో పీఎంశ్రీ నిధులు రూ.20.58 లక్షలతో కెమిస్ట్రీ ల్యాబ్ భవనాన్ని, క్రీడా ప్రాంగణం, దాత కొత్తపల్లి పాండురంగరాజు సహకారం రూ.20 లక్షలతో ఆధునికీకరించిన పాఠశాల షెడ్‌లను మంగళవారం ఆయన ప్రారంభించారు. తన నియోజకవర్గంలోని అన్ని స్కూళ్లలో దశలవారీగా కెమిస్ట్రీ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. కోళ్ళపర్రు, దుంపగడప గ్రామాల్లో మైక్రో ఫిల్టర్‌లను ప్రారంభించారు. అనంతరం దాత కొత్తపల్లి పాండురంగరాజును ఘనంగా సన్మానించారు. కోళ్ళపర్రు, కళింగగూడెం, సిద్దాపురం దుంపగడప గ్రామాల్లో సీసీ రహదారులు, సచివాలయం, వరదరాజస్వామి వారి కల్యాణ మండపాలను ప్రారంభించారు. సిద్దాపురంలో చెత్త ట్రాక్టర్‌ను స్టార్ట్ చేసి పంచాయతీకి అందజేశారు. డీఈవో నారాయణ, ఏపీసీ శ్యామ్‌సుందర్, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మోటుపల్లి రామవరప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, సర్పంచ్‌లు ఆదిలక్ష్మి, అన్నపూర్ణ, ముద్దే విశ్వేశ్వరరావు, గురువెల్లి రఘుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సాహితీ సంబరాల పోస్టర్ ఆవిష్కరణలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే బొలిశెట్టి తదితరులు

ప్రపంచ సాహితీ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక సారథ్యంలో ఏలూరు జిల్లాలో ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించే ప్రపంచ సాహితీ సంబరాల పోస్టర్‌ను కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి మాట్లాడుతూ ఈ సంబరాలు ఏలూరులోని మహాలక్ష్మి గోపాల స్వామి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజి, బీజేపీ నాయకులు నరిసే సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతవిద్యలో రాణించాలి

తాడేపల్లిగూడెం నన్నయ క్యాంపస్ సందర్శించిన వీసీ ప్రసన్నశ్రీ

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ఉన్నత విద్యలో విద్యార్థులు రాణించాలని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్‌ను మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గూడెం క్యాంపస్‌లో వనరులు, వసతులు సమకూర్చి క్యాంపస్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మహిళా వసతిగృహాన్ని సందర్శించి మెస్‌లోనే భోజనం చేశారు. విద్యార్థినులకు గోరుముద్దలు తినిపించి వారి ఆలనాపాలనా తెలుసుకున్నారు. అధ్యాపకులు నాణ్యమైన బోధనందించాలని, విద్యార్థుల ఉన్నతిని ఆకాంక్షిస్తూ బోధించాలన్నారు. క్యాంపస్‌లో సిబ్బంది హాజరు, పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో గూడెం క్యాంపస్ ప్రిన్సిపాల్ టి.అశోక్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినికి భోజనం తినిపిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

ఆర్టీసీ లీజు స్థలాలపై నేడు అవగాహన సదస్సు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆర్టీసీకి సంబంధించి లీజు స్థలాలపై అవగాహన సదస్సును ఈనెల 9వ తేదీన నిర్వహిస్తామని డీపీటీవో ఎన్‌వీఆర్ వరప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.భీమవరంలోని డీపీటీవో కార్యాలయ కాన్ఫరెన్సు హాలులో సాయంత్రం 4 గంటలకు సదస్సు నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని కొయ్యలగూడెం, కలిదిండి, భీమవరం (స్టాఫ్ క్వార్టర్స్ స్థలం) ఆకివీడు బస్టాండ్‌లలో ఉన్న ఖాళీస్థలాలను 15 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చే నిమిత్తం తీసిన టెండరు ప్రకటనపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

తాడేపల్లిగూడెంలో వైసీపీ కార్యకర్తలకు తీరని అన్యాయం

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో వైసీపీ కార్యకర్తలకు తీరని అన్యాయం జరుగుతుందని పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు గుండుమోగుల నాగు ఆవేదన వ్యక్తం చేశారు. తాడేపల్లిగూడెంలోని ఆయన నివాసం వద్ద విలేకర్లతో మాట్లాడారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, ప్రస్తుతం కార్యకర్తలకు ఆసరాగా నిలబడే నాయకులు లేరన్నారు. ఇప్పటికైనా అధిష్ఠానం నియోజకవర్గ ఇన్‌చార్జి మార్పు చేయకుంటే పార్టీలో కార్యకర్తలు నిలబడే పరిస్థితి ఉండదన్నారు. తనకు ఏ బాధ్యత ఇచ్చినా పార్టీ కోసం పనిచేస్తానని, దీనిపై పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానన్నారు.


మాట్లాడుతున్న నాగు

దువ్వ గ్రామస్థుడిపై పీడీ యాక్ట్ కేసు.. జైలుకు తరలింపు

తణుకు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు వర్గాల మధ్య వైషమ్యాలను పెంచేవిధంగా ప్రవర్తిస్తున్న ఓ వ్యక్తిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేశామని తణుకు రూరల్ ఎస్‌ఐ కె. చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. వివరాలివి.. దువ్వ గ్రామానికి చెందిన అద్దంకి వెంకన్న ఈ ఏడాది ఫిబ్రవరి ఆరో తేదీన గ్రామంలోని హైవే వద్ద గల సూర్యదేవాలయం ఆవరణలో భజన, కోలాటం చేస్తున్న మహిళలను భయభ్రాంతులకు గురిచేసేలా ప్రవర్తిస్తూ రెండువర్గాల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టేలా వ్యవహరించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అతడిని అరెస్ట్ చేసి జైలుకు పంపించినా ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో పాటు గతంలో నాలుగు కేసులున్నట్టు తెలిపారు. అతడి ప్రవర్తన కారణంగా గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉండడంతో కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో మంగళవారం పీడీ యాక్ట్‌పై అరెస్ట్ చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

దొంగలొస్తారు తస్మాత్ జాగ్రత్త !


2018 ఏలూరు-శాంతినగర్‌లో న్యాయవాది ఇంటికి వచ్చిన చెడ్డీగ్యాంగ్.. ఇంటి తలుపులకు బైక్‌ను అడ్డుగా కట్టేస్తున్న దృశ్యాలు

వేసవి కాలం వచ్చేసింది. వడగాల్పులు ప్రారంభమయ్యాయి. ఉక్కపోత పెరిగింది. పగలంతా ఎండకు ఎండి వడగాల్పులకు అలసిపోయి సాయంత్రం సమయంలో వచ్చే చల్లగాలికి ఆరుబైట విశ్రాంతి తీసుకుంటూ ఉంటారు. మరికొంత మంది డాబాపైకి వెళ్లి నిద్రిస్తూ ఉంటారు. ఇంకొంత మంది బెడ్‌రూమ్‌లో ఏసీ, ఫ్యాన్లు వేసుకుని నిద్రిస్తూ ఉంటారు. ఆ ఏసీ, ఫ్యాన్ల శబ్దాలకు బయట నుంచే వచ్చే శబ్దాలు తెలియవు. ఇదే అదునుగా దొంగలు యథేచ్ఛగా దొంగతనాలకు పాల్పడుతూ తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తూ రెచ్చిపోతున్నారు. అయితే స్థానికంగా ఉండే దొంగల విధానం వేరు.. వీరు పగటి వేళ రెక్కీ నిర్వహించి ఇళ్లకు తాళాలు వేసి ఉన్నవాటిని పరిశీలిస్తారు. సాయంత్రం సమయంలో ఇళ్లల్లో లైట్లు వెలగడం కాని, బయట లైట్లు వెలగడం కాని లేకపోతే కచ్చితంగా వారు ఊరు వెళ్లారని గుర్తించి ఆ ఇంటిలో దొంగతం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు.

- ఏలూరు క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) :

వేసవి కాలంలో రెచ్చిపోతున్న దొంగలు

- అర్ధరాత్రి వేళ తెగబడుతున్న ముఠాలు
- ఏలూరు జిల్లా కంట్రోల్ రూమ్ నంబరు 83329 59175కు సమాచారమివ్వాలి

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఉన్న తెలగపాముల ముఠా, చెడ్డీ గ్యాంగ్ వంటి ముఠాలు చాలా ప్రమాదకరమైనవి. వారికి తాళాలు వేసి ఉన్న ఇళ్లతో పనిలేదు. ఇంట్లో ఎంతమంది ఉన్నా వారికి పనిలేదు. ఇది ధనవంతుల ఇల్లు అని అంచనా వేశారంటే కచ్చితంగా ఆ ఇంట్లోకి చొరబడతారు. ఇంటి తలుపును బద్దలకొట్టేస్తారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడతారు. అవసరమైతే దాడులకు తెగబడతారు. ఈ ముఠాలు జిల్లాలో 2002లోనూ, 2004లోనూ, 2006లోనూ, 2014లోనూ, 2018లోనూ, 2021లోనూ చెడ్డీగ్యాంగులు, తెలగపాముల ముఠాలు వచ్చిన ఘటనలు ఉన్నాయి. 2004లో ఏలూరు మెయిన్‌బైపాస్ రోడ్డు, చొదిమెళ్ళ చింతలపూడి రోడ్డులోని ఆర్టీవో ఆఫీసు సమీపంలోని ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. ఇంట్లో వారిని బెదిరించారు. 2006లో జంగారెడ్డిగూడెం రోడ్డు, జోగన్నపాలెం బ్రిడ్జి సమీపంలో ఒక ఉద్యోగి ఇంట్లో చొరబడి దారుణానికి పాల్పడ్డారు. వృద్ధులను కట్టేసి చిత్రహింసలకు గురిచేశారు. 2018లో ఏలూరు శాంతినగర్‌లోని న్యాయవాది సత్యనారాయణ ఇంట్లో ఒక చేపల చెరువుల వ్యాపారి అద్దెకు ఉంటుండగా అదేరోజు ఆయన కోట్ల రూపాయల నగదును రైతులకు ఇవ్వడానికి తీసుకువచ్చారు. మొత్తం మీద చడ్డీగ్యాంగ్ అర్ధరాత్రి వేళ 2018 మార్చి 23 రాత్రి 1.15 గంటలకు ప్రవేశించి ఎవరూ బయటకు రాకుండా తలుపులకు తీగలు చుట్టేశారు. అంతేకాకుండా వారి ఇంటి వద్ద మోటారు సైకిళ్లను తీసుకువచ్చి తలుపులకు కట్టేశారు. అలికిడి వచ్చిందని న్యాయవాది సత్యనారాయణ వెంటనే మేల్కొని సీసీ పుటేజీలో చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. చుట్టుపక్కల వారికి కూడా ఫోన్లు చేశారు. వారు వచ్చేసరికి దొంగలు పారిపోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. కానీ ఇంతవరకూ ఆ చెడ్డీగ్యాంగ్ ఆచూకీ కానరాలేదు. ఏలూరు నగరం జాతీయ రహదారికి దగ్గరలో ఉండడంతో చెడ్డీ గ్యాంగ్ నగరంలోకి సులువుగా వచ్చి రాత్రి వేళ తప్పించుకు పోవడానికి ఆస్కారం ఎక్కువగా ఉండడంతో ఈ నేరాలు జరుగుతున్నాయని గుర్తించారు.

ఊరెళితే సమాచారమివ్వాలి



నేరాలు జరుగకుండా ముందస్తుగా విలువైన వస్తువులను ఇళ్లల్లో ఉంచుకోవద్దు. వీలైనంత వరకు నగదు, వస్తువులు బ్యాంకు లాకర్లో ఉంచుకోవడం ఎంతో ఉత్తమం. ఊర్లు వెళ్లేవారు తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్ సమాచారం ఇస్తే వారు ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాను అమర్చుతారు. ఎవరైనా ఆ ఇంట్లోకి ప్రవేశిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం వెళ్తుంది. నిమిషాల వ్యవధిలో పోలీసులు చేరుకుంటారు.

– కిశోర్, ఎస్పీ, ఏలూరు జిల్లా

ఈ జాగ్రత్తలు చాలా ముఖ్యం

ప్రతిరోజు న్యూస్ పేపర్ వేయించుకునేవారు ఊరెళ్లే సమయంలో ఆ పేపర్‌ను ఆపేయమని చెప్పడం లేదా వేరేవారి దగ్గర ఇవ్వాలని చెప్పాలి. ఒకేసారి పేపరు ఓపెన్ చేయకుండా ఇంటి ముందు కనిపిస్తే కచ్చితంగా వారు ఊరులో లేనట్లు గుర్తిస్తారు. పాలప్యాకెట్ల పరిస్థితి ఇంతే. వాకిలి తుడవక పోవడం, ముగ్గులు లేకపోవడాన్ని గమనిస్తారు. మనుషుల కదలికలు లేనివి గుర్తిస్తారు. బెడ్‌లైట్ అయినా ఆ ఇంటి ముందు వేసి ఉంచుకోవాలి. లోపల మరో బెడ్‌లైటు వెలిగేలా చూసుకోవాలి. బంధువులు, స్నేహితులనో ఆ ఇంటి వద్ద కాపలాడా ఉండమనడమో లేదా రోజుకు ఒకటి రెండుసార్లయినా వెళ్లి చూడమని చెప్పుకోవాలి. ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే 112కు గాని సమీప పోలీస్ స్టేషన్‌కు గాని సమాచారం అందించాలి. లేదా జిల్లా కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 83329 59175కు సమాచారమివ్వాలి.

జిల్లా పోలీసులు భేష్

ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్ బాధ్యతలు చేపట్టిన తరువాత నేరస్తులపై నిఘా పెంచారు. గతంలో జరిగిన దొంగతనాలు, ప్రస్తుతం జరిగిన దొంగ తనాలు ఛేదించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. సంక్రాంతి పండుగ రోజున బాధితుల ఇళ్లల్లో పండుగ వాతావరణం కనిపిం చేలా చోరీ సొత్తును రికవరీ చేసిన వాటిని బాధితులకు ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో అప్పగించారు.

పెంచిన గ్యాస్ భారం ప్రభుత్వమే భరించాలి

- శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

ఏలూరురూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం గ్యాస్‌పై పెంచిన రూ.50 భారం ప్రభుత్వమే భరించాలని, ఉపాధి కూలీలకు 70 రోజులు గడిచినా వేతనాలు చెల్లించలేని పరిస్థితిలో ఉందని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఏలూరు క్రాంతి కల్యాణ మండపంలో వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ మామిళ్ళపల్లి జయప్రకాష్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ప్రజలకు మేలు చేసిందే తప్ప కక్షపూరితంగా వ్యవహరించలేదన్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని, కార్యకర్తలు ఇంట్లో కూర్చోకుండా ఏదైనా పిలుపునిస్తే తరలిరావాలని సూచించారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం పార్టీ కార్యకర్తలు, నాయకులను ఇబ్బంది పెడుతుందని, వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనని అప్పుడు గుంటూరు ఇవతల నుంచి ఇబ్బంది పెట్టిన టీడీపీ నాయకులను ఇంట్లో నుంచి లాగి కొడతారని, గుంటూరు అవతలి నుంచి నరికి పడేస్తారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, కారుమూరి సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు పుప్పాల వాసుబాబు, మేకా వెంకటప్రతాప్ అప్పారావు, తెల్లం బాలరాజు, తదితర నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

క్రైమ్ కార్నర్

వేర్వేరు చోట్ల ఆరుగురి మృతి

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో వేర్వేరు చోట్ల మంగళవారం మొత్తం ఆరుగురు మృతి చెందారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ముత్యాలపల్లికి చెందిన వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చిట్టవరం గ్రామానికి చెందిన వ్యక్తి మురికి కాల్వలో పడి మరణించాడు. మొగల్తూరుకు చెందిన యువకుడు గోదావరి పడి మృతి చెందాడు. ఏలూరు జిల్లా ఏలూరులో ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో, కలరాయనగూడెం, సూరేపల్లి గొల్లగూడెంలకు చెందిన ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య


హేమలత మృతదేహం

మొగల్తూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ముత్యాలపల్లి పంచాయతీ గెదళ్ళవంపు గ్రామంలో ఒక మహిళ అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మొగల్తూరు పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన బంధన హేమలత(26) అదే గ్రామానికి చెందిన రమేష్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. భర్త జీవనోపాధి నిమిత్తం రెండేళ్ల క్రితం గల్ఫ్ వెళ్లి పది రోజుల క్రితం వచ్చాడు. వీరికి ఒక పాప ఉంది. మంగళవారం సాయంత్రం హేమలత ఇంటిలో ఉరివేసుకుని మృతి చెందింది. ఆమె ఆత్మహత్యకు భర్త కుటుంబ సభ్యులే కారణమంటూ ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈఘటనపై మొగల్తూరు ఎస్‌ఐ జి.వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు కొత్త బస్టాండ్‌లో ఒక వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంనకు చెందిన సరికొప్పు భూషణం (65)కు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. అందరికి వివాహాలు చేశారు. అతడు పొగాకు బేరన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరం గ్రామంలోని ఒక రైతు వద్ద పొగాకు బేరన్ డ్రైవర్‌గా పనిచేయడానికి తమ గ్రామానికి చెందిన ఒక మేస్త్రిద్వారా వచ్చాడు. రెండు రోజుల క్రితం అనారోగ్యంగా ఉండడంతో ఆ మేస్త్రి అతడిని గుంటూరుకు పంపించడానికి బస్సు ఎక్కించాడు. ఏలూరులో బస్సు దిగిన అతడు బస్టాండ్‌లో అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు త్రీటౌన్ పోలీసులకు అందడంతో మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

మురుగు కాల్వలో పడి ఒకరు..

నరసాపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) రెండు రోజుల క్రితం కనిపించకుండా పోయిన చల్లా నాగాంజనేయులు(28) మంగళవారం పాలకొల్లు రోడ్డులోని మురుగు కాల్వలో శవమై కనిపించాడు. నరసాపురం టౌన్ సీఐ యాదగిరి తెలిపిన వివరాలివి.. చిట్టవరం గ్రామానికి చెందిన అతడు మొగల్తూరు మండలంలోని ఓ ఆక్వా ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం విధులు ముగించుకుని ఇంటికి వస్తూ కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మొగల్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం పాలకొల్లు రోడ్డులోని ఇటుకల బట్టీ వద్ద మురికికాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రోడ్డుపై వెళుతున్న వాహనదారులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బయటకు తీయగా ఒంటిమీద ఉన్న దుస్తులు ఆధారంతో నాగాంజనేయులుగా పోలీసులు గుర్తించారు. అతడి మృతిపై అనేక వదంతులు వినిపిస్తున్నాయి. మృతదేహాన్ని రుస్తుంబాద ప్రభుత్వాస్పత్రికి తరలించి, ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

లింగపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో చేసిన అప్పులు తీర్చలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన లింగపాలెం మండలం కలరాయనగూడెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన గద్దల మురళీ(33) అనే యువకుడు వ్యవసాయంలో చేసిన అప్పులు తీర్చలేక ఈనెల ఆరో తేదీన పొలంలోకి వెళ్లి మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఏలూరు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడలో ఆసుపత్రికి తీసుకు వెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కె. వెంకన్న తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

ముసునూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక గడ్డి నివారణ మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై ముసునూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ఎం.చిరంజీవి తెలిపిన వివరాలివి.. సూరేపల్లి గొల్లగూడెంకు చెందిన ఉలాస రమేష్ (34) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల మూడోతేదీ మధ్యాహ్న సమయంలో తట్టుకోలేని కడుపునొప్పి రావడంతో పొలానికి వెళ్లి గడ్డి నివారణమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యానికి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గోదావరిలో యువకుడి మృతదేహం లభ్యం

యలమంచిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు గ్రామానికి చెందిన యువకుడు లక్కు శేఖర్(21) మృతదేహం బాడవ సమీపంలో గోదావరిలో మంగళవారం లభ్యమైంది. ఆదివారం నుంచి కనిపించకుండా పోయిన ఆ యువకుడు.. సోమవారం చించినాడ బ్రిడ్జిపై మోటారుసైకిల్, సెల్‌ఫోన్, చెప్పులు ఉండడం పాఠకులకు విదితమే. పోలీసులు యువకుడి ఆచూకీకోసం గోదావరిలో గాలించగా మంగళవారం సాయంత్రం మృతదేహం లభ్యమైంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని ఎస్‌ఐ కె.గుర్రయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.


ఏలూరులో వివరాలు వెల్లడిస్తున్న ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్

ఇద్దరు దొంగల అరెస్టు

రూ.ఐదు లక్షల నగదు స్వాధీనం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : స్కూటర్ డిక్కీలో పెట్టిన నగదు అపహరించిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ఏఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, సీసీఎస్ సీఐ సీహెచ్ రాజశేఖర్ పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఏలూరుకు చెందిన పి.రవిశంకర్ శ్రీనివాస్ ఈ ఏడాది మార్చి నాలుగో తేదీన ఏలూరు అమీనాపేటలో ఉన్న బరోడా బ్యాంకులో రూ.ఐదు లక్షల నగదును డ్రా చేసుకుని స్కూటీలో పెట్టుకుని మినీబైపాస్‌లో ఉన్న చలసాని గార్డెన్స్ వద్దకు వెళ్లారు. అక్కడ స్కూటీ బయటపెట్టి లోపలికి వెళ్లి వచ్చేసరికి నగదు అపహరణకు గురైంది. ఈ ఘటనపై త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. సీసీ పుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించారు. ఏలూరు మినీబైపాస్ పెదపాడు బ్రిడ్జి వద్ద మంగళవారం ఉదయం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం కుమ్మరి బజారుకు చెందిన షేక్ గాల్సిద్ అలియాస్ సాహిద్, మైలవరం మండలం చిలుకూరి వారి గూడెంకు చెందిన బొంతు రాజశేఖరరెడ్డి అలియాస్ అమూల్‌రెడ్డిలను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ నేరానికి పాల్పడింది వీరేనని గుర్తించారు.

అంతేకాకుండా ఈనెల నాలుగో తేదీన ఏలూరు మినీ బైపాస్ రోడ్డులో ఓ యువతి స్కూటర్‌పై వెళ్తూ ఫోన్ రావడంతో ఆగి మాట్లాడుతూ ఉండగా ఇద్దరు యువకులు పల్సర్ మోటారు సైకిల్‌పై వెళ్లి ఆమెను బెదిరించి రూ.70 వేలు అపహరించినట్టు నేరం అంగీకరించారు. స్కూటర్ డిక్కీలో అపహరించిన రూ.ఐదు లక్షల్లో రూ.50 వేల ఖర్చులు చేయగా మిగిలిన నాలుగున్నర లక్షల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. యువతి వద్ద అపహరించిన రూ.70 వేలలో రూ.20 వేల ఖర్చులు చేశారు. మొత్తం రూ.ఐదు లక్షల నగదు వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. వీరిపై ఇప్పటివరకు ఎలాంటి కేసులు లేవని చెడువ్యసనాలకు బానిసలై నేరాలు చేయడం ప్రారంభించారన్నారు. నేరస్తులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబర్చిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

మద్యం షాపులో చోరీ

భీమవరం క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మద్యం షాపులో పనిచేస్తున్న ఒక వ్యక్తి అకౌంట్లు తారుమారు చేసి నగదును దోచుకున్నాడు. టూటౌన్ ఎస్‌ఐ ఇజ్రాయేల్ తెలిపిన వివరాలివి.. గరగపర్రు రోడ్డులోని బీవీ రాజు బొమ్మ సమీపంలో ఉన్న ఎస్‌ఎం వైన్స్‌లో నంబుల గణేశ్వర సీతాప్రసాద్ కొంతకాలంగా క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల రెండో తేదీ నుంచి ఆరో తేదీ వరకు యజమానికి లెక్కలు అప్పగించలేదు. అనుమానం వచ్చి లెక్కలు చూడగా రూ.3 లక్షల 75 వేల నగదు లావాదేవీలు తేడా వచ్చాయి. ఈ మేరకు యజమాని కోరాడ శ్రీనివాస్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఇజ్రాయేల్ తెలిపారు.

సేంద్రియ సాగులో రైతుకు నిర్మా అవార్డు


అవార్డు అందుకుంటున్న రైతు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గుండుగొలనుకుంటకు చెందిన ఒబిలిశెట్టి గోపాల కృష్ణ మూర్తికి నిర్మా-2025 అవార్డును అందజేసింది. రాజమహేంద్రవరం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఆన్ కమర్షియల్ అగ్రికల్చర్ సంస్థ సేంద్రియ సాగులో గోపాలకృష్ణ సేవలను గుర్తించి అభినందించారు.

భీమడోలు టీడీపీ గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

భీమడోలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు తెలుగుదేశం పార్టీ నూతన కార్యవర్గం ఎన్నికైంది. స్థానిక నాయకులు ప్రసాద్ గృహం వద్ద జరిగిన సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షునిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా భూషణం, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గన్ని మాట్లాడుతూ నూతన కమిటీ ఆధ్వర్యంలో బూత్ ఇన్‌ఛార్జులు, కుటుంబ సాధికార సారథుల కమిటీని నియమించుకోవాలని సూచించారు.

విద్యుత్ ఉద్యోగులకు కంటి పరీక్షలు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ భవన్‌లో ఉద్యోగులకు, పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆ శాఖ సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ పి. సాల్మన్‌రాజు ప్రారంభించి నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి సౌజన్యంతో ఉద్యోగులకు అన్ని రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఉద్యోగ సంఘ నాయకులు తురగా రామకృష్ణ మాట్లాడుతూ పని ఒత్తిడిలో ఉన్న సిబ్బందికి ఆరోగ్య భద్రతకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు భూక్యా నాగేశ్వరరావు, ఎం.రమేష్, వి.రాము, పి.శ్రీనివాస్, ఎ.శ్రీనివాస్, ఎస్.సురేష్ పాల్గొన్నారు.

ప్రేమాలయంలో సంపూర్ణ వ్యక్తిత్వ వికాస శిక్షణ

ఏలూరురూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థినులకు ప్రేమాలయంలో పరిపూర్ణ వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమాన్ని సెంటర్ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్సీ, స్టెప్, మానవత సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని విభిన్న ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు ఆధ్వర్యంలో ఐఐటీ నిపుణులు ప్రొఫెసర్ విజయ కుమార్, అబ్బన్న, సైకాలజిస్ట్ శ్రీనివాస్, శాంతారాం శిక్షణ అందించనున్నారు. ప్రేమాలయం నిర్వాహకులు వెంకటేష్ గురూజీ, మానవత సంస్థ ప్రతినిధులు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్తులో రాణించాలంటే వ్యక్తిత్వ వికాస శిక్షణ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నారా శేషు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

బొర్రంపాలెంలో మోడల్ స్కూల్ కొనసాగించాలి

టి.నర్సాపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బొర్రంపాలెం ఎస్సీ పేటలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలను మోడల్ స్కూల్‌గానే కొనసాగించాలని అంబేద్కర్ యువజన సంఘ నాయకులు సామాజిక కార్యకర్త గుండే పాండు రంగ కోరారు. ఈ మేరకు మానవ వనరుల కేంద్రంలో మండల విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. నూతన విద్యావిధానంలో భాగంగా ప్రాథమిక పాఠశాలను ఫౌండేషన్ స్కూల్‌గా మార్చడం వల్ల విద్యార్థులు నష్టపోయే అవకాశముందని వినతిపత్రంలో పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో జి.గణపతి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నిలిచిపోయిన పనులు చేపట్టాలి

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో నిధుల కొరత కారణంగా అసంపూర్తిగా మిగిలిపోయిన నిర్మాణాల పనులు, రిపేర్లను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని మంగళవారం సాయంత్రం సమగ్ర శిక్ష జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్‌ను ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీయే) విజ్ఞప్తి చేసింది. సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు స్టీవెన్ మాట్లాడుతూ పలు పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, టాయిలెట్స్, కాంపౌండ్ వాల్స్, మైనర్ రిపేర్లు, పెయింటింగ్ పనులు నిధులలేమి కారణంగా నిలిచిపోయాయన్నారు. ఏపీసీని కలిసిన సంఘ నాయకుల్లో వెంకట రమణ, ఫెడరిక్ బాబు, తదితరులున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ తెలిపారు. పట్టణ టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యలపై వచ్చే అర్జీలను చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ స్వీకరిస్తారని తెలిపారు. జంగారెడ్డిగూడెం మండల, పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు పెనుమర్తి రామకుమార్, రాజాన పండు మహంకాళి రామ్మోహనరావు, వలవల తాతాజీ, పాతూరి అంబేద్కర్, షేక్ యాకూబ్,మిడతా పెంటయ్య పాల్గొన్నారు.

రెండు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

కామవరపుకోట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా వ్యానుపై తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని తడికలపూడి పోలీసులు ఆకస్మిక దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. తడికలపూడి ఎస్ఐ పి.చిన్నారావు, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ శేషగిరి, తడికలపూడి వీఆర్వో వి.రమేష్‌లు మాట్లాడుతూ తడికలపూడి సెంటర్‌లో తనిఖీలు చేపట్టగా రెండు క్వింటాలను తరలిస్తున్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో తడికలపూడి ఏఎస్ఐ వీరాస్వామి, సిబ్బంది, వీఆర్‌ఏలు ఉన్నారు.

మంత్రి ఆనం రామనారాయణను కలిసిన నాయకులు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణను మంగళవారం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు ఆధ్వర్యంలో పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. విశిష్ట దేవాలయంగా పేరు గాంచిన గురవాయిగూడెంలోని శ్రీ మద్ది ఆంజనేయ స్వామిని దర్శించాలని కోరినట్టు శేషు తెలిపారు. టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మాలోతు దారు నాయక్‌ను కలిసి జంగారెడ్డిగూడెం మండలం చక్రదేవరపల్లిలో ఉన్న ఎస్టీలను కె.ఆర్.పురం ఐటీడీఏలో విలీనం చేసి వారి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, టీడీపీ నాయకులు కొటారు ప్రసాద్, చుక్కా సూర్య ప్రకాశ్, పి.నాగిరెడ్డి, సి.హెచ్.సురేశ్, జి.గుర్నాథ్‌రెడ్డి, జి.అరుణ్ రెడ్డి, ఎం.రాజేశ్, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఐదడుగుల తాచు పాము పట్టివేత



జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కె.వెంకటరెడ్డి ఇంట్లో వంట గదిలోకి దూరిన ఐదడుగుల తాచు పామును స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ క్రాంతి సురక్షితంగా బంధించి అడవిలో విడిచిపెట్టారు. ఇంట్లోకి వచ్చిన పామును చూసి కుటుంబ సభ్యులు గడగడావణికిపోయారు. సమాచారం మేరకు క్రాంతి ఘటనా స్థలానికి చేరుకుని పామును బంధించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దండి : ఎమ్మెల్యే


చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా 8, 9, 10 డివిజన్స్‌లో పర్యటించిన అనంతరం పారిశుధ్య సిబ్బంది సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. పలు కార్యక్రమాల్లో భాగంగా పాతబస్టాండ్ వద్ద చలివేంద్రాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎం.పార్థసారథి, ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ భానుప్రతాప్, మారం హనుమంతరావు, ఎస్.శ్రీనివాస్, ఆర్నేపల్లి తిరుపతి, బాలకృష్ణ పాల్గొన్నారు.


చాటపర్రులో నిరసన తెలియజేస్తున్న ఉపాధి కార్మికులు

ఉపాధి కార్మికుల వేతనాలు విడుదల చేయాలి

ఏలూరు రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనిచేస్తున్న కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో ఉపాధి పనులు చేస్తున్న పని ప్రదేశాలలో కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.జనవరి నెల నుంచి రావాల్సిన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

ఇంత నిర్లక్ష్యమా?

- కార్పొరేషన్‌లో హెల్త్ ఆఫీసర్ పోస్టు ఖాళీ
- నగరంలో పెరుగుతున్న అపరిశుభ్రత
- పర్యవేక్షణ లేక సిబ్బందిలో అలసత్వం


పేరుకుపోయిన చెత్త, అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరపాలక సంస్థకు హెల్త్ ఆఫీసర్(ఎంహెచ్‌వో) లేక పోవడంతో అపారిశుధ్యం పెరిగిపోతోంది. మున్సిపాలిటీల్లో హెల్త్ ఆఫీసర్ దగ్గరుండి పారిశుధ్య కార్మికులతో నగరాన్ని శుభ్రం చేయిస్తారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన పోస్టు ఖాళీగా ఉందంటే నగరం ఎలా ఉంటుందో ఏలూరు నగరాన్ని చూస్తే అర్థమవుతోంది. 8 నెలలుగా హెల్త్ ఆఫీసర్ లేక రోజురోజుకి నగరం అపారిశుధ్యంగా తయారవుతోంది. ప్రస్తుతం పారిశుధ్య విభాగాన్ని రెండుగా చీల్చి టూటౌన్‌కు అడిషనల్ కమిషనర్, వన్‌టౌన్‌కు డిప్యూటీ కమిషనర్‌ను ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. వీరి ఇరువురు రిటైర్‌మెంట్‌కు కొద్ది నెలల దూరంలో ఉండగా స్థానికంగా లేకపోవడం మరో సమస్య.. తాపీగా ఉదయం 11గంటలకు ఆఫీస్‌కు వస్తే తెల్లవారు జామున 4, 5 గంటలకు పర్యవేక్షించాల్సిన పనుల సంగతేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలకు పనులు అప్పగించడంతో వారిపై పర్యవేక్షణ కొరవడింది. అధికారుల పర్యవేక్షణ లేక నగరంలోని డ్రైన్‌లు, రోడ్లు, అపారిశుధ్యంగా తయారవుతున్నాయి. అంతే కాకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పని చేయించే సమయాల్లో ఉదయం 7 గంటలకు ఇన్‌ఛార్జ్‌లుగా ఉన్న అధికారులు వీడియోకాన్ఫరెన్స్‌లు ఎక్కడ నుంచో నిర్వహిస్తూ పని చేసే వారికి ఆటంకం కలిగిస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్‌లో ఉంటే పారిశుధ్య పనుల పర్యవేక్షణ ఎలా అంటూ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారులు విధులు పర్యవేక్షించాల్సింది పోయి పనులు చేయించే వారితో వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైన ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నగరపాలక సంస్థలో ఎంహెచ్‌వోను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

తొలి ప్రాధాన్యం పారిశుధ్యానికే

ఎ.భాను ప్రతాప్, నగర పాలక సంస్థ కమిషనర్

తొలి ప్రాధాన్యం పరిశుధ్యానికే ఇస్తున్నాం. అడిషనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌తో కలిసి నేను కూడా వేకువ జామునే వీధుల్లోకి వచ్చి పారిశుధ్యం పనులు పర్యవేక్షిస్తున్నాం. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, కార్మికులు పారిశుధ్య పనులపై అలసత్వం వహిస్తే క్షమించేది లేదు. ఎక్కడైనా అపారిశుధ్యం ఉంటే స్థానిక ప్రజలు తెలియపర్చాలి. వెంటనే సిబ్బందిని పంపించి తగు చర్యలు తీసుకుంటాం.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించండి

సీపీఐ అనుబంధ సంఘాల ఆందోళనలు



నిడమర్రు సెంటర్‌లో ధర్నా చేస్తున్న నాయకులు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించాలని ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, ఏఐటీయూసీ నాయకులు కృష్ణమాచార్యులు,పి.కిశోర్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వమని ఒక పక్కన చెప్పుకుంటూ ప్రజలపై అధిక భారాన్ని మోపుతుందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ అనుబంధ సంస్థల నాయకులు బండి వెంకటేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, ఎ.అప్పలరాజు, బొగత జగన్నాథరావు, వి.దత్తు, వినోద్, కడుపు కన్నయ్య, పొట్టేలు పెంటయ్య, బళ్ళ కనకదుర్గారావు, మహిళా ప్రతినిధులు మావూరి విజయ, శైలజ, జయలక్ష్మి పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం : పెంచిన గ్యాస్, డీజిల్ ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు ఆధ్వర్యంలో డీజిల్, పెట్రో ధరలు తగ్గించాలని ఆందోళనలు చేయగా ఈ కార్యక్రమంలో ఎస్.కె. బాజీ, వెలగల నాని, రామకృష్ణ, రాంబాబు పాల్గొన్నారు.

● నిడమర్రు : డీజిల్, పెట్రో ధరలు తగ్గించాలని నిడమర్రు సెంటర్‌లో నాయకులు ధర్నా చేపట్టగా జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు, కోన శ్రీనివాసరావు, వి.మోహనరావు, తోపు కృష్ణ, దారబోయిన గాంధీ, గిద్దా నాగేశ్వరరావు, ఆళ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

● కుక్కునూరు : పెరిగిన పెట్రో, డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గించాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం కుక్కునూరు ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎం.వెంకటాచారి, కొన్నే లక్ష్మయ్య, పోరాకుల బాబూరావు, ప్రశాంత్ పాల్గొన్నారు.

● వేలేరుపాడు : సామాన్యులపై అధిక భారం పడేలా కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం భూదేవిపేట గ్రామం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమాల్లో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండీ ముస్నీర్, పార్టీ మండల కార్యదర్శి బాడిస రాము, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యర్రా మధు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం : సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బుట్టాయగూడెంలో చేపట్టిన ధర్నాలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి, మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, నాయకులు చుంద్రు బుల్లెమ్మ, సోయం శ్రీనివాసు, మడకపాటి అనూష, మరియమ్మ, పంతులమ్మ, కుమారి పాల్గొన్నారు.

● కామవరపుకోట :కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ సీపీఐ నాయకులు, కార్యకర్తలు మంగళవారం తహసీల్దార్ గెద్దం ఎలీషాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు, ఏఐటీయుసి నాయకులు బుచ్చిబాబులు, యూనియన్ నాయకులు నల్లమోతుల అప్పన్న, బి.రమణారావు, కె.బుచ్చిబాబు ఉన్నారు.

కార్యకర్తలకు ఆర్థిక భరోసా కల్పించాలి

టి.నర్సాపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): విజయవాడ క్యాంపు కార్యాలయంలో మంత్రి కొల్లు రవీంద్రను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, పశ్చిమ గోదావరి జిల్లా బీసీ విభాగాల కోఆర్డినేటర్ కొండపల్లి రవి మర్యాదపూర్వకంగా కలిశారు. గత వైసీపీ అరాచకాలతో ఆర్థికంగా నష్టపోయిన కార్యకర్తలను ఆదుకోవాలని కోరారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి తనవంతు బాధ్యతగా కార్యకర్తలకు అండగా నిలబడతానని భరోసా ఇచ్చినట్టు రవి తెలిపారు.

చికెన్ వ్యర్థాల వాహనం స్వాధీనం

పెదపాడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్.ఐ. కట్టా శారద సతీశ్ తెలిపారు. తోటగూడెం - వసంతవాడ గ్రామాల సమీపంలో ఐషర్ వాహనంలో సుమారు 10 వేల కిలోల చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు.డ్రైవర్, చెరువు యజమానులపై కేసు నమోదు చేసి, చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టినట్టు తెలిపారు.

విద్యాశాఖ డైరెక్టర్‌కు వినతి

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : విద్యా సంస్కరణల్లో భాగంగా నూతన విద్యా సంవత్సరం నుంచి కొత్తగా ప్రారంభించనున్న క్లస్టర్లకు నియమించనున్న హెచ్‌ఎం పోస్టులను గ్రేడ్-1 హెచ్‌ఎం పోస్టులుగా అప్‌గ్రేడ్ చేయాలని అభ్యర్థిస్తూ పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజుకు డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు విజయవాడలో మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. మూడేళ్లలోపు సర్వీసున్న టీచర్లను బదిలీ నుంచి మినహాయించాలని కోరారు. ఎంటీఎస్ టీచర్లకు 12నెలల జీతం, 62 సంవత్సరాల ఉద్యోగ విరమణ వయస్సును వర్తింపజేయాలని అభ్యర్థించామన్నారు.

దూరవిద్య ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రశాంతం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో భాగంగా మంగళవారం ఫిజిక్సు నిర్వహించారు. ఈ పరీక్షకు 40 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 30 మంది, కెమిస్ట్రీ ప్రాక్టికల్స్‌కు 40మందికి 32, బయోలాజికల్ సైన్సు 40మందికి 27మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.


నియామక పత్రాలు అందజేస్తున్న ఎస్పీ కిశోర్

కారుణ్య నియామకంలో ఇద్దరికి ఉద్యోగాలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కారుణ్య నియామకంలో భాగంగా ఇద్దరికి ఉద్యోగ నియామక పత్రాలను ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం అందించారు. మంగళగిరిలోని 6వ బెటాలియన్ ఏపీ ఎస్పీలో విధులను నిర్వహిస్తున్న కొట్నాని తారకరామారావు మరణించగా ఆయన సతీమణి రాంబా జయశ్రీ, ఏఆర్పీసీ మధు కుమార్ మరణించగా ఆయన సతీమణి కొడమంచిలి ఆది లక్ష్మీలకు కారుణ్య నియామక ఉద్యోగ ధృవపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ విభాగంలో విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరుల కుటుంబాలను ప్రోత్సహించడం, ఆదుకోవడం తమ ప్రధాన బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, అధికారులు పాల్గొన్నారు.

కోకో పంటకు గిట్టుబాటు ధర కావాలి

జీలుగుమిల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : కోకో పంట కొనుగోలు చేయకుండా కొన్ని కంపెనీలు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నాయని, కొనుగోలు నిలిపి వేశారన్నారు. ఏపీ రైతు సంఘం మండలాధ్యక్షుల దాసరి జానకి రామిరెడ్డి అన్నారు. దర్భగూడెంలో ఇటీవల వర్షానికి తడిచి ఆరబెడుతున్న కోకో పంటను పరిశీలించారు. అకాల వర్షాలకు మండలంలో మామిడి, జీడిమామిడి పర్జీనియా పొగాకు, అరటి పంటలు దెబ్బతిన్నాయని, వీరందరినీ ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సీహెచ్ సీతారామయ్య ఉన్నారు.

ఆశా కార్యకర్తలకు న్యాయం చేయాలి

వేలేరుపాడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల్లో గర్భిణులు, బాలింతలకు సేవలందిస్తున్న ఆశ కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని వేలేరుపాడు పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ అనుబంధ సంస్థ ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కారం దారయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రకటిస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజలకు అందజేయడంలో ఆశ కార్యకర్తలు విశేష కృషి చేస్తున్నారని అన్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి రాజ్యసభలో ఆశ కార్యకర్తలకు వేతనాలు పెంచుతామని ఉద్యోగ గుర్తింపు ఇస్తామని హామీ ఇప్పటికీ అమలు కాలేదన్నారు. ఆశ కార్యకర్తల డిమాండ్లు నెరవేర్చి న్యాయం చేయాలని ఆయన కోరారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలి

వేలేరుపాడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయాలని, 18 ఏళ్లు నిండిన యువతి, యువకులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు మాట్లాడుతూ పోలవరం ప్యాకేజీలో భాగంగా 18 ఏళ్లు నిండిన యువతి, యువకులు మండలంలో వందల సంఖ్యలో ఉన్నారని ప్రభుత్వం తమ నిబంధనలు సవరించి అందరికీ న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముత్యాలరావు, వీరాస్వామి, మేడేపల్లి సర్పంచ్ కట్టం రాంబాబు, నాళ్లవరం సర్పంచ్ రంగమ్మ, తిరుమలాపురం సర్పంచ్ చోడే విజయ, నాళ్లవరం ఎంపీటీసీ కరటం రత్తమ్మ, మేడేపల్లి ఎంపీటీసీ కారం తమ్మయ్య, సత్యవతి, భాస్కర్ పాల్గొన్నారు.


కొల్లేరు అభివృద్ధిపై చర్చిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

టూరిజం అభివృద్ధికి చర్యలు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కొల్లేరులో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టి స్థానిక ప్రజలకు కూడా జీవనోపాధి కల్పించేలా చర్యలు చేపడుతున్నామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఏలూరు రూరల్ పరిధిలోని మాధవరంలో పక్షుల అటవీ సంరక్షణ కేంద్రంలో టూరిజం అభివృద్ధి చేసే కార్యాచరణపై ఫారెస్టు శాఖ సహా పలు శాఖల అధికారులతో జడ్పీ అతిథి గృహంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. మాధవపురం పక్షుల సంరక్షణ కేంద్రంలో రోడ్ బండ్ అధ్వానంగా ఉందని దానిని అభివృద్ధి చేస్తే పర్యాటకులకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. సుందరీకరణ, విద్యుత్ దీపాలు, అప్రోచ్ రోడ్ల ఏర్పాటుపై ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో, డివిజనల్ ఫారెస్టు అధికారిణి, ఫారెస్టు అధికారులు పాల్గొన్నారు.

మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : సింగపూర్ స్కూల్లో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడిన డిప్యూటీసీ పవన్ కళ్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన దేవుడుని ప్రార్థించారు.

వ్యాధులపై అవగాహన

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికున్ గున్యా, మెదడువాపు, తదితర వ్యాధులపై మంగళవారం స్థానిక పవర్ పేట అర్బన్ పీహెచ్‌సీలో ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఇంటింటా సర్వేనిర్వహించి దోమలు పెరిగే ఆవాసాలను గుర్తించి లార్వాదశలోనే వాటిని నాశనం చేయడం ద్వారా వ్యాధులను నియంత్రించవచ్చని జిల్లా మలేరియా అధికారి ప్రసాద్ సూచించారు. మలేరియా విభాగం అధికారులు, సిబ్బంది గోవిందరావు, పద్మజ కుమారి, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ పరీక్షకు 128 మంది హాజరు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్ పరీక్షల్లో భాగంగా మంగళవారం స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ స్కూల్లో జరిగిన ఆన్‌లైన్ పరీక్షకు 133 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 128మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

పిల్లల పోషణ పట్ల శ్రద్ధ తీసుకోవాలి

కొయ్యలగూడెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పిల్లల పట్ల తల్లులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ అంబటి సరస్వతి కోరారు. ఈ మేరకు మంగళవారం పొంగుటూరులో పోషణ పక్వాడ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పొంగుటూరు సెక్టార్‌లోని పొంగుటూరు, గవరవరం, రాజవరం, యర్రంపేట, అంగన్వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.



అడుగంటిన నాచుగుంట చెరువు

ఉంగుటూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : నాచుగుంట మంచినీటి పథకం చెరువు అడుగంటింది. గత కొన్ని రోజులుగా పైపులు మరమ్మతులకు గురికావడంతో వేసవి దృష్ట్యా తాగునీటికి ఇబ్బంది లేకుండా చేయాలని జిల్లా యంత్రాంగం ఆదేశాలు జారీ చేయడంతో ఆర్.డ.బ్ల్యు.ఎస్ అధికారులు మరమ్మతులు చేయించారు. గత రెండ్రోజులుగా బోర్ల నుంచి నీటిని చెరువులోకి పంపింగ్ చేస్తున్నారు. నాచుగుంట పంచాయతీ పరిధిలోని పాటిమీద, యర్రమళ్ల, వెల్లమిల్లి పంచాయతీలోని వెల్లమిల్లి, చింతాయిగూడెం, చిన వెల్లమిల్లి గ్రామాలకు తరచూ పైపులు మరమ్మతులకు గురికావడంతో ఆయా గ్రామాల ప్రజలు పలు మార్లు అధికారులకు విన్నవించారు. ఈ చెర్వు నీటితో నింపడానికి సుమారు ఇరవై నుంచి నెల రోజులు పడుతుందని స్థానికులు చెబుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు, జేసీ ధాత్రి

భీమడోలు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) :ఉంగుటూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జేసీ ధాత్రిరెడ్డి చేతుల మీదుగా ఎమ్మెల్యే ధర్మరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాల సమయంలో రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన టార్పాలిన్‌లను తెచ్చుకోవచ్చన్నారు.

● చింతలపూడి : రాఘవాపురం రైతు సేవా కేంద్రంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొత్తం మండలంలో 15కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వ్యవసాయ శాఖ ఏడీ నాగకుమార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సుమారు 13వేల 250 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశముందన్నారు.

ఇంటర్వ్యూ..

గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి చర్యలు

కందుల వాణి, ఎంపీడీవో, లింగపాలెం



● మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులేంటి?

జవాబు: ఇప్పటి వరకు రూ.6 కోట్ల 30 లక్షల ఉపాధి నిధులు ఖర్చు చేసి సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులు చేపడుతున్నాం.

● మురుగు నీటి సమస్యకు పరిష్కారం ఏమిటి?

జవాబు: గ్రామాల్లోని మురుగును బయటకు పంపేలా డ్రైనేజీల్లో పూడిక తొలగింపు పనులు చేయిస్తున్నాం. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందితో కలిసి డ్రైనేజీలు, వాటర్ ట్యాంకులు శుభ్రం చేయించడం, శానిటేషన్, వీధి లైట్లు పనులు చేస్తున్నాం.

● మండలంలో ఉన్న తాగునీటి సమస్యకు పరిష్కారం ఏమిటి?

జవాబు: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందిస్తున్నాం. తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా అందించేలా కార్యదర్శులకు ఆదేశాలిస్తున్నాం.

● చెత్తకేంద్రాల నిర్వహణ ఎలా ఉంది?

జవాబు: క్లాప్ మిత్రల ద్వారా చెత్త సేకరించి సంపద సృష్టి కేంద్రాలకు తరలించి సేంద్రియ ఎరువు తయారు చేయిస్తున్నాం. ఆ ఎరువు ఆయా గ్రామాల రైతులకు తక్కువ ధరకు అందజేస్తాం.

లింగపాలెం,(ఆంధ్రజ్యోతి)

13న గురుకులాలకు ప్రవేశ పరీక్ష

పెదపాడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరం, 5వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్ష ఈ నెల 13న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి 4.30 గంటల వరకు జరుగుతుందని వట్లూరులోని డాక్టరు బి.ఆర్. అంబేద్కర్ గురుకులం ప్రిన్సిపాల్ రూప్సీ రాణి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని ఆధార్ కార్డుతో పరీక్షకు హాజరు కావాలని కోరారు.

ఘనంగా అన్నసమారాధనలు

పెదపాడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : అప్పనవీడు అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద దాతలు వెంకట దుర్గా లక్ష్మి ఇంజనీరింగ్ వారి ఆర్థిక సహకారంతో సుమారు 200 మంది భక్తులకు అన్నదానం నిర్వహించినట్టు ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు. పెదపాడులోని తెలగాలపేటలోని కోదండ రామాలయంలో నవమి వేడుకల్లో భాగంగా సుమారు రెండు వేలమందికి అన్నదానం నిర్వహించారు. అన్నదానంలో పెదపాడు, పరిసర గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ముగిసిన వర్క్‌షాపు

చింతలపూడి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేపట్టిన రెండ్రోజుల వర్క్‌షాపు మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆరోగ్య వంతమైన రేపటి యువత కోసం అనే అంశంపై ఈ వర్క్ షాపులో పలు సూచనలు చేశారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు పర్యవేక్షించగా కార్యక్రమాలను అధ్యాపకులు, వైస్ ప్రిన్సిపల్ నరేంద్ర కుమార్ సమన్వయ కర్తలుగా వ్యవహరించారు.



రిక్షాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోషన్

శుభ్రతను పాటించండి

చింతలపూడి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీని పరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. నగర పంచాయతీ కొనుగోలు చేసిన 25 చెత్త బండ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ డి.పావని, మాజీ సర్పంచ్ చిట్లూరి ధర్మరాజు, కొత్తపూడి శేషగిరిరావు, బిజెపి నాయకులు తోట వెంకట నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ సహకార నామ సంవత్సరం

ఏలూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : ఐక్య రాజ్యసమితి ఈ సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార నామ సంవత్సరంగా ప్రకటించిన సందర్భంగా ఏలూరు జిల్లా సహకారశాఖ కార్యాలయంలో మంగళవారం ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. సోమవారం డీసీఎంఎస్‌లో రక్తదాన శిబిరం నిర్వహించగా, 115 మంది సొసైటీల, ఇతర సిబ్బంది రక్తదానం చేయడంపై కలెక్టర్ కె.వెట్రి సెల్వి అభినందించారు. ఈ సందర్భంగా కేక్‌ను డీసీవో అరిమిల్లి శ్రీనివాస్ కట్ చేసి ఉద్యోగులకు తినిపించారు.

దొంగలొస్తారు.. తస్మాత్ జాగ్రత్త

- అర్ధరాత్రి వేళ తెగబడుతున్న ముఠాలు
- ఏలూరు జిల్లా కంట్రోల్ రూంకు 83329 59175 సమాచారమివ్వాలి


ఏలూరులో చెడ్డీగ్యాంగ్ సీసీ కెమెరా దృశ్యాలు(ఫైల్)

ఏలూరు క్రైం(ఆంధ్రజ్యోతి)

వేసవిలో చాలామంది ఆరుబయట, లేదా డాబాలపై నిద్రిస్తూ ఉంటారు. ఇదే అదునుగా దొంగలు యథేచ్ఛగా దొంగతనాలకు పాల్పడుతూ తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తూ రెచ్చిపోతుంటారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఉన్న తెలగ పాముల ముఠా, చెడ్డీ గ్యాంగ్ వంటి ముఠాలు చాలా ప్రమాదకరమైనవి. వారికి తాళాలు వేసి ఉన్న ఇళ్లతో పనిలేదు. ఇంట్లో ఎంతమంది ఉన్నా వారికి పనిలేదు. ఇది ధనవంతుల ఇల్లు అని అంచనా వేశారంటే కచ్చితంగా ఆ ఇంట్లోకి చొరబడతారు. ఇంటి తలుపును బద్దలకొట్టేస్తారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడతారు. అవసరమైతే దాడులకు తెగబడతారు. ఏలూరు నగరం జాతీయ రహదారికి దగ్గరలో ఉండడంతో చెడ్డీ గ్యాంగ్ నగరంలోకి సులువుగా వచ్చి రాత్రి వేళ తప్పించుకు పోవడానికి ఆస్కారం ఎక్కువగా ఉండడంతో ఈ నేరాలు జరుగుతున్నాయని గుర్తించారు.

జిల్లా పోలీసులు భేష్

ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్ బాధ్యతలు చేపట్టిన తరువాత నేరస్తులపై నిఘా పెంచారు. గతంలో జరిగిన దొంగతనాలు, ప్రస్తుతం జరిగిన దొంగ తనాలు ఛేదించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. సంక్రాంతి పండుగ రోజున బాధితుల ఇళ్లల్లో పండుగ వాతావరణం కనిపించేలా చోరీ సొత్తును రికవరీ చేసిన వాటిని బాధితులకు ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో అప్పగించారు.

ఈ జాగ్రత్తలు చాలా ముఖ్యం

ప్రతిరోజు న్యూస్ పేపర్ వేయించుకునేవారు ఊరెళ్లే సమయంలో ఆ పేపర్‌ను ఆపేయమని చెప్పడం లేదా వేరేవారి దగ్గర ఇవ్వాలని చెప్పాలి. ఒకేసారి పేపరు ఓపెన్ చేయకుండా ఇంటి ముందు కనిపిస్తే కచ్చితంగా వారు ఊరులో లేనట్లు గుర్తిస్తారు. పాలప్యాకెట్ల పరిస్థితి ఇంతే. వాకిలి తుడవక పోవడం, ముగ్గులు లేకపోవడాన్ని గమనిస్తారు.మనుషుల కదలికలు లేనివి గుర్తిస్తారు. బెడ్‌లైట్ అయినా ఆ ఇంటి ముందు వేసి ఉంచుకోవాలి. లోపల మరో బెడ్‌లైటు వెలిగేలా చూసుకోవాలి. బంధువులు, స్నేహితులనో ఆ ఇంటి వద్ద కాపలాడా ఉండ మనడమో లేదా రోజుకు ఒకటి రెండుసార్ల యినా వెళ్లి చూడమని చెప్పుకోవాలి. ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే 112కు గాని సమీప పోలీస్ స్టేషన్‌కు గాని సమాచారం అందించాలి. లేదా జిల్లా కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 83329 59175కు సమాచామివ్వాలి.

ఊరెళితే సమాచారమివ్వాలి: ఎస్పీ కిశోర్

నేరాలు జరుగకుండా ముందస్తుగా విలువైన వస్తువులను ఇళ్లల్లో ఉంచుకోవద్దు. వీలైనంత వరకు నగదు, వస్తువులు బ్యాంకు లాకర్లో ఉంచుకోవడం ఎంతో ఉత్తమం. ఊర్లు వెళ్లేవారు తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్ సమాచారం ఇస్తే వారు ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాను అమర్చుతారు. ఎవరైనా ఆ ఇంట్లోకి ప్రవేశిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం వెళ్తుంది. నిమిషాల వ్యవధిలో పోలీసులు చేరుకుంటారు.

ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రొయ్యల రైతుల సమస్యలను పరిష్కారానికై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళ వారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆక్వారైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని త్వరలోనే సమస్య పరిష్కా రమవుతుందన్నారు. 9 నెలలుగా చేపల మేతల ధరలు భారీగా తగ్గాయని రూ.2 లక్షలు విలువ చేసే లారీ డీవోబీ తౌడు రూ.95 వేలకి వస్తుందని చేపల రైతులుకు కొంత ఊరటనిచ్చామని ఊహించని విధంగా ట్రంప్ ప్రతీకార సుంకం విధించడంతో రొయ్యల రైతులుకు ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, రైతులు, మత్స్యశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారన్నారు. ఈ సమస్యను కేంద్రమంత్రి పియూష్ గోయల్ దృష్టికి తీసుకువెళ్లారన్నారు.

అలాగే కొల్లేరు సమస్యను గత ప్రభుత్వం అసమర్థత వలన జఠిలమైందని 22 వేల ఎకరాలు సరిహద్దులు నిర్ధారించాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ నెల 16వ తేదీన సుప్రీంకోర్టులో మరోసారి రాష్ట్ర ప్రభుత్వం తరపున కొల్లేరు అంశంపై వాదనలు వినిపిస్తారని కొల్లేరు సమస్యను రాజకీయ కోణంలో చూడకూడదన్నారు. కొల్లేరు ప్రజల జీవన విధానం దెబ్బ తినకుండా సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల రావు, టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కూటమి నేతలు బొర్రా చలమయ్య, పెన్మెత్స త్రినాధరాజు, తేరా రమేష్‌బాబు, పూల రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంలో వివిధ గ్రామాలకు చెందిన 13 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అందజేశారు. 13 మందికి రూ.5,10,987 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి : సీపీఐ

నూజివీడు టౌన్/నూజివీడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను తక్షణమే తగ్గించాలని, లీటర్ పెట్రోల్, డీజిల్ ఎక్సైజ్ డ్యూటీని రెండు రూపాయలు పెంచడాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. నూజివీడు పట్టణ సమితి ఆధ్వర్యంలో పెద్ద గాంధీ బొమ్మ సెంటర్లో భారత కమ్యూనిస్టు పార్టీ కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. నూజివీడు పట్టణ సీపీఐ కార్యదర్శి చాట్ల పుల్లారావు మాట్లాడుతూ పెంచిన గ్యాస్ ధర తగ్గించే వరకు సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాల్ని కొనసాగిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పల్లె ప్రేమ్‌కుమార్, పి.ప్రవీణ్, ఒగ్గు ముఖర్జీ, ఏఐటీయూసీ నాయకులు కోలా రామ్మూర్తి, బోను చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలపై బీజేపీ భారం...

నూజివీడు 15వ వార్డులో పెంచిన గ్యాస్, పెట్రో, డీజిల్ ధరలను తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ప్రజలపై భారాలు వేయడం, సంపన్నులకు దోచిపెట్టడం తప్ప మరొకటి లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను చౌకగా పెట్టుబడిదారులకు, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలును వేంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రంగారావు. కల్పన తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో నిబంధనలు పాటించాలి


రీసర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

ముసునూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ సమగ్ర రీ సర్వే చేయాలని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కొర్లకుంట పంచాయతీ శివారు తాళ్ళవల్లిలో జరుగుతున్న రీసర్వేను ఆయన తనిఖీ చేశారు. తొలుత రీ సర్వేపై గ్రామసభ నిర్వహించి, రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ సరిహద్దులను నిర్ధారించారు. ఆయన మాట్లాడుతూ రీ సర్వేకు రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు. సర్వేలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని, సమగ్ర వివరాలతో కూడిన రికార్డును పొందుపర్చాలని సర్వే సిబ్బందికి సూచించారు. సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీసత్యనారాయణ, టీడీపీ నాయకులు మానురాజు సురేష్, బర్మా శ్రీనివాసరావు,విలేజ్ సర్వేయర్ కె.శంకర్, వీఆర్వో మణేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.


కోనేరులోని సాగర్ జలాలు పరిశీలిస్తున్న స్థానిక నాయకులు

ఆగిరిపల్లి మెట్ల కోనేరులోకి సాగర్ జలాలు

ఆగిరిపల్లి 8 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాలను పూర్తిస్థాయిలో విడుదల చేసిన నేపథ్యంలో మంగళవారం ఉదయం నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు ఆగిరిపల్లి మెట్ల కోనేరును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో అవరోధాలను దాటి సాగర్ నీళ్ల ఆగిరిపల్లి ప్రాంతానికి వచ్చాయని వీటిని వృథా చేయకుండా ఆయకట్టు రైతులు ఆరుతడి పంటలకు, తాగునీటి చెరువులకు పెట్టుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ ఉప్పు వెంకటేశ్వర రావు, నీటి సంఘాల అధ్యక్షుడు పల్లగాని నాగేంద్రరావు, తమ్మిశెట్టి రాంబాబు, నక్కనబోయిన వేణు, ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎం.శ్రావణ్ కుమార్, దొండపాటి ఏసుపాదం, చౌటపల్లి విక్టర్ బాబు, పామర్తి నరసయ్య, బెక్కం రాజగోపాల్, నలజాల హరిబాబు, పానుగంటి గోపి, ఎస్.ఎస్.బాబు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ చోరీ

కైకలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ చోరీకి గురైంది. రామవరం గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 6న రాత్రి ఆలయ కమిటీ సభ్యుడు కావూరి వేణుగోపాలరావు స్వామివారిని దర్శించుకునేందుకు వెళ్లాడు. రాత్రి 8 గంటల ప్రాంతంలో తలుపులు పగలగొట్టి గుడిలోని వస్తువులు చిందరవందరగా పడవేసి హుండీని పగలగొట్టినట్లు గుర్తించారు. వేణుగోపాలరావు ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాంబాబు తెలిపారు.

తీరని దాహార్తి

- ఉప్పు కయ్యగా మంచినీటి చెరువు
- సరిపడని కుళాయి నీరు
- గొంతెండుతున్న రామచంద్రపురం



ఉప్పు కయ్యగా మారిన రామచంద్రపురం మంచినీటి చెరువు, నీరు రాని కుళాయిలు

ముదినేపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బొమ్మినంపాడు శివారు రామచంద్రపురం గ్రామం దాహార్తితో అలమటిస్తోంది. సుమారు 400 మంది జనాభా కలిగిన గ్రామంలో సమస్యల పరిష్కారం కనుచూపు మేరలో కనిపించడం లేదు. గ్రామంలోని రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన మంచినీటి చెరువు పక్కనే ఉన్న ప్రైవేట్ రొయ్యల చెరువు వల్ల ఉప్పు కయ్యగా మారింది. నీటి పథకం ద్వారా చెరువు నుంచి సరఫరా చేసే నీరు సాధారణ వినియోగానికి కూడా పనికిరావు. మంచినీటి చెరువుకు దగ్గరలోనే రొయ్యల చెరువు తవ్వొద్దని అప్పట్లో గ్రామస్థులు మొరపెట్టుకున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరి ఫలితాన్ని గ్రామస్థులు ఇప్పుడు అనుభవిస్తున్నారు. ప్రస్తుతం నీటి కుళాయిల ద్వారా రెండు, మూడు బిందెల నీళ్లే వదులుతున్నారు. నెలరోజులుగా గ్రామంలో ఎక్కువ శాతం విద్యుత్ వీధి దీపాలు వెలగడం లేదు. చుట్టూ చెరువుల మధ్య ఉన్న శివారు గ్రామంలో వీధి దీపాలు వెలగక రాత్రిళ్ల గ్రామస్థులు విషపు పురుగుల భయంతో బిక్కు బిక్కుమంటూ కాలం గడుపుతున్నామని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


కోదండ రామస్వామి ఆలయంలో పూజలు

ముగిసిన తిరు కల్యాణోత్సవాలు

ముదినేపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెంలోని బావాజీ మఠం కోదండ రామస్వామి ఆలయంలో ఐదు రోజులుగా జరుగుతున్న తిరు కల్యాణోత్సవాలు మంగళవారం ముగిశాయి. మహాపూర్ణాహుతి, చక్రస్నానం, వసంతోత్సవం చేశారు. అనంతరం ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగం, పవళింపు సేవ కార్యక్రమాలను అర్చకుడు ఆసూరి రంగనాథాచార్యులు నిర్వహించారు.

ముదినేపల్లి మండలంలో ముగ్గురికి పదోన్నతులు

ముదినేపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖల్లో ముగ్గురు ఉద్యోగులకు ప్రమోషన్లు లభించాయి. ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రాతిపదికన మండలం లోని దాకరం గ్రామ పంచాయతీలో గ్రేడ్-5 కార్యదర్శిగా పనిచేస్తున్న లోకం శివ నాగేశ్వరరావుకు గ్రేడ్-4 కార్యదర్శిగా ప్రమోషన్ ఇచ్చారు. ముదినేపల్లి -2 వీఆర్వో బాల సుబ్రహ్మణ్యంకు రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా, ముదినేపల్లి తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ గూడపాటి అనిల్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.


ఆనం వెంకట రమణారెడ్డిని కలసిన కలిదిండి కూటమి నాయకులు

ఆక్వా రైతులను ఆదుకోవాలి

కలిదిండి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించి ఆక్వా రైతులను ఆదుకోవాలని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాస్, కూటమి నాయకులు కోరారు. ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ గౌరవ కో-వైస్ చైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డిని మంగళవారం విజయవాడలో కలసి విన్నవించారు. అమెరికా సుంకాల నేపథ్యంలో రొయ్యల ధరలు పతనమవడంతో రైతులకు పెట్టుబడులు కూడా రాక నష్టాల పాలవుతున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని కోరారు. టి.పరశురాముడు, చంద్రరాజు, కె.గోకనేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


వడాలి సెంటర్‌లో హైవేపై బైఠాయించి ధర్నా చేస్తున్న దళిత మహిళలు

ఆత్మహత్య కాదు..భర్తే చంపేశాడు

- తనుశ్రీ కుటుంబానికి న్యాయం కోరుతూ దళితుల రాస్తారోకో

ముదినేపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వడాలి గ్రామంలో గుండాబత్తిన తనుశ్రీ (19) బలవన్మరణానికి కారకుడైన ఆమె భర్త అనిల్ కుమార్‌ను కఠినంగా శిక్షించాలని ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గ్రామ సెంటర్‌లో పెద్ద సంఖ్యలో దళితులు ధర్నా నిర్వహించారు. తనుశ్రీ ఆత్మహత్యకు అనిల్ కుమార్ పెట్టిన వేధింపులే కారణమని పోలీసులు కేసు నమోదు చేశారని అయితే అనిల్‌కుమారే చంపేశాడని ఆరోపిస్తూ ఆమె బంధువులు, దళిత మహిళలు, యువకులు ధర్నా నిర్వహించారు. మృతదేహంతో ముదినేపల్లి- భీమవరం హైవేపై రాస్తారోకో చేశారు. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆందోళన చేశారు. కైకలూరు సీఐ రవికుమార్, ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు, ఏపీ టూరిజం డవలెప్‌మెంట్ కార్పొ రేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ ఆందోళకారులతో చర్చించారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో దళితులు ఆందోళన విరమించారు. మండవల్లి ఎస్ఐ రామచంద్రరావు, ముదినేపల్లి ఏఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

కైకలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కైకలూరు వారపుసంత వద్ద విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ లక్కోజు సురేష్ రూ.30 వేలు అందజేశారు. అధ్యక్షుడు తుపాకుల సోమాచారి, నాని, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, మంగినేని రామకృష్ణ, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు శర్మ, దుర్గాప్రసాద్, పాండు, సుబ్బారావు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

రేపు కలిదిండి మండల సమావేశం

కలిదిండి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అధ్యక్షతన ఈ నెల 10న మండల పరిషత్ సమావేశం జరుగుతుందని ఎంపిడివో కొండలరావు తెలిపారు. సభ్యులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

పిల్లలందరిని బడిలో చేర్పించాలి



పడమటిపాలెంలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

కలిదిండి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్పించాలని ఎంఈవో శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పడమటి పాలెంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో బడిబాట నిర్వ హించారు. రాబోయే విద్యా సంవత్సరానికి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజన పథకం, స్టూడెంట్ కిట్లు మౌలిక సదుపాయాల గురించి వివరించారు. కలిదిండి ఏపీటీఎఫ్ నాయకులు నున్న శ్రీనివాస్, కళారి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, శివనాగమణి, నారాయణ దాస్, భాస్కర్ వర్మ, బొడావుల నాగరాజు, కట్టా శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కుక్కల స్వైరవిహారం

- ఏడాదిలో 562 మందిపై దాడి- భయాందోళనలో ప్రజలు
- అదుపునకు చర్యలు తీసుకోవాలంటూ వేడుకోలు


రోడ్లపై సంచరిస్తున్న వీధి కుక్కలు

చాట్రాయి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తూ జనాన్ని హడలెత్తిస్తున్నాయి. బయటకు వెళితే ఏ కుక్క ఎటు నుంచి వచ్చి దాడి చేస్తాయోనని ప్రజలు భయపడిపోతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం 2024 మార్చి నుంచి ఈ ఏడాది నెలాఖరు వరకు చాట్రాయి పీహెచ్‌సీకి 562 మంది కుక్కకాటు బాధితులు వచ్చి యాంటీరేబిస్ వ్యాక్సిన్ వేయించుకున్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లిన వారు ఎంతమందో లెక్కే లేదు. నిత్యం పీహెసీకి కుక్కకాటు బాధితులు వస్తుండడం ఆందోళన కలిగించే విషయం. ఆరేళ్ల క్రితం వరకు ప్రతి ఏడాది గ్రామాల్లో పంచాయతీల ఆధ్వర్యంలో కుక్కల నిర్మూలన చేసేవారు. శునక సంక్షేమ సంఘాలు పంచాయతీ ఉద్యోగులపై కోర్టులలో కేసులు వేస్తుండడంతో కుక్కల నిర్మూలనకు స్వస్తి చెప్పారు. దీంతో కుక్కలు విపరీతంగా పెరిగాయి. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడిపోతున్నారు. కుక్కల సంఖ్య ఇదేవిధంగా పెరిగితే మనుషులు బతికే పరిస్థితి ఉండదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కుక్కల సంతతి పెరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

అందుబాటులో రేబిస్ వ్యాక్సిన్

కుక్కకాటు కేసులు పెరగడంతో చాట్రాయి పీహెచ్‌సీలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచుతున్నాము. 2024 మార్చి నుంచి గత నెల మార్చి వరకు 562 మంది కుక్కకాటు బాధితులకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్ అందించాం. కుక్కకాటుకు గురి కాకుండా అవసరమైన జాగ్రత్తలు పాటించాలి.

- డాక్టర్ విజయలక్ష్మి,
పీహెచ్‌సీ వైద్యాధికారి, చాట్రాయి


మొక్కజొన్న కండెలు ఆరబెడుతున్న రైతు

రైతుకు అకాల కష్టం

చాట్రాయి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అకాల వర్షం సోమవారం రాత్రి కురవడంతో కల్లాలపై ఉన్న మొక్కజొన్న పంట తడిసిపోయి రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కల్లాలపై ఉన్న మొక్కజొన్న కండెలు, అమ్మకానికి సిద్ధం చేసిన మొక్కజొన్న గింజలు, కాటాలు వేసి లాట్లు కట్టిన బస్తాలు తడిసిపోవడంతో మంగళవారం కూలీలను పెట్టి ఎండబెడుతున్నారు.వర్షం వల్ల శ్రమ, కూలీల ఖర్చు పెరిగిపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. తమకు కలిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వాలు ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ముసునూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక గడ్డి మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై ముసునూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపిన వివరాలివి.. సూరేపల్లి గొల్లగూడెంకు చెందిన ఉలాస రమేష్ (34) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల మూడోతేదీ మధ్యాహ్న సమయంలో తట్టుకోలేని కడుపునొప్పి రావడంతో పొలానికి వెళ్లి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి అతడు మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడి కుటుంబానికి పరామర్శ

ముసునూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ముసునూరు బీసీకాలనీకి చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు మానికల శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం రాత్రి బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పరామర్శించారు. శ్రీనివాసరావు కుటుంబానికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. స్థానిక వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475


చెక్కపల్లిలో ఉపాధి కార్మికులకు సూచనలిస్తున్న ఏపీవో రోజ్‌లీల

ఉపాధి పనుల్లో నాణ్యత ఉండాలి : ఏపీవో రోజ్‌లీల

ముసునూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనులు ప్రభుత్వ నిబంధనలతోపాటు నాణ్యతగా జరగాలని ఏపీవో రోజ్‌లీల అన్నారు. మంగళవారం చెక్కపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె తనిఖీ చేసి, కూలీలకు పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఉదయమే పనిచేసేలా కూలీలకు సౌకర్యం కల్పించామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేయాలని, అవకతవకలకు పాల్పడితే వేతనాలను నిలిపివేస్తామన్నారు. ఉపాధి పనుల నాణ్యతను సిబ్బంది, అధికారులు నిత్యం పర్యవేక్షించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో టీఏ రవికుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం



వేల్పుచర్లలోని పోషణ పక్వాడ్ ర్యాలీలో ఐసీడీఎస్ సిబ్బంది

ముసునూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు సమపాళ్లలో క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం వేల్పుచర్ల, చింతల వల్లి గ్రామాల్లో పోషణ పక్వాడ్‌పై ర్యాలీ నిర్వ హించి, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణి నిర్ధారణ అయిన దగ్గర నుంచి తొమ్మిదో నెల వరకు బరువు 10 నుంచి 12 కేజీల పెరిగేలా ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆరోగ్య పరీక్షలు, రక్తహీనత, హెచ్‌బీ శాతం తదితర వాటిని ఆమె వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మద్యం షాపులు మూయించండి

చాట్రాయి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఈనెల 14న పురస్కరించుకుని ఆ రోజు మద్యం షాపులు మూసివేయాలని సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ గీతకు వినతిపత్రం అందజేశారు.గాంధీ జయంతికి ప్రభుత్వం మద్యం షాపులు మూయిస్తున్న మాదిరిగానే అంబేడ్కర్ జయంతికి కూడా వర్తింపజేయాలని కోరారు.

14 మందికి బైండోవర్

నూజివీడు టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాటు సారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 అనే కార్యక్రమములో భాగంగా నూజివీడు మండలం, పోలసానపల్లి గ్రామానికి చెందిన 14 మంది పాత నేరస్తులను నూజివీడు తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి వారిని బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.సుబ్బారావు మాట్లాడుతూ బైండోవర్ సంవత్సరకాల పరిమితి ఉంటుందని మళ్లీ ఎక్సైజ్ నేరాలకు పాల్పడిన వారి వద్ద నుంచి రూ.లక్ష జరిమానా విధించడంతో పాటు ప్రభుత్వ పథకాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎ.మస్తానయ్య పాల్గొన్నారు.